

కనకగిరి గుట్టలు

కనకగిరిలో కనులవిందు

- ఊటీ, కొడైకెనాల్ తరహాలో విస్తరించిన కొండలు
- ఆకట్టుకుంటున్న అటవీ, ఆధ్యాత్మిక ప్రాంతాలు
- ఈ గుట్టలపైనే కాకతీయుల నాటి వీరభద్రుడి ఆలయం
- ఎకో టూరిజం అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు
- పర్యాటకులను ఆకర్షించేలా పలు నిర్మాణాలు
- పులిగుండాల రిజర్వాయర్‌లో బోటింగ్ ఏర్పాట్లు
- వచ్చే వానాకాలం నాటికి పూర్తిస్థాయిలో అభివృద్ధి

ఖమ్మం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఊటీ, కొడైకెనాల్, కూనూరు మాదిరి ఎత్తైన కొండలు. ఆహ్లాదాన్ని పంచే చల్లని గాలులు. చిరుత పులులు, ఎలుగుబంట్లు, జింకలు, అడవిదున్నలతోపాటు అరుదైన పక్షి సంపదకు నిలయమైన ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని కనకగిరి అటవీ ప్రాంతం ఎకో టూరిజంతో రాబోయే రోజుల్లో పర్యాటకులకు కనువిందు చేయనుంది. ఇటు అటవీ పర్యాటకంతో పాటు దైవభక్తిని పెంచే ఆధ్యాత్మిక పర్యాటకం, పిల్లలలో అడవులు చెట్లు, జంతువులు, పక్షుల పట్ల అవగాహన పెంచేలా కనకగిరి రిజర్వు ఫారెస్టు అతిథ్యం ఇవ్వనుంది. తెలంగాణ-ఆంధ్రా సరిహద్దులో సుమారు 20వేల హెక్టార్లలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో విస్తరించి ఉన్న కనకగిరి గుట్టల్లో పర్యాటక అభివృద్ధి పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి.

కనకగిరి కొండల విశిష్టత

తెలంగాణ-ఆంధ్రాకు సరిహద్దున ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలను అనుసంధానిస్తూ తల్లాడ, పెనుబల్లి, కల్లూరు, ఏన్కూరు, చంద్రుగొండ, జూలూరుపాడు తదితర మండలాల్లో 20 వేల హెక్టార్లలో విస్తరించి ఉన్న రిజర్వు ఫారెస్టులో ఎత్తైన కొండలున్నాయి. సముద్ర మట్టానికి 570 మీటర్ల నుంచి 792 మీటర్ల (మిగతా 6వ పేజీలో)


కాకతీయులు నిర్మించిన గోడ


వెదురు పొదల మధ్య అటవీ మార్గం


మాతాశిశు కిట్

కిట్లు లేవు.. డబ్బులు రావు!

- గర్భిణులకు అందని ప్రభుత్వ 'ప్రోత్సాహం'
- ప్రసవం తరువాత అందించే కిట్లూ కరువు
- రూ.50కోట్లకు పైగానే బకాయి
- ఇబ్బందులు పడుతున్న పేదలు

ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలను పెంచేందుకు గత ప్రభుత్వం కేసీఆర్ కిట్లు అందచేసింది. ఈ పథకం ప్రారంభమైనప్పటి నుంచి గర్భిణులు సర్కారు దవాఖానాలకు రావడం మొదలైంది. ఆడపిల్ల పుడితే రూ.13వేలు, మగపిల్లాడైతే రూ.12వేలు ఇచ్చేవారు. ఈ ప్రోత్సాహకాలు రెండు కాన్పుల వరకు అందించేవారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత ఇప్పుడు ఆ ప్రోత్సాహకాలు (మిగతా 6వ పేజీలో)

భద్రాద్రి జిల్లాలో గాలివాన

- మామిడి, మిర్చి రైతుల ఆందోళన
- మోస్తరు వర్షంతో చల్లబడ్డ వాతావరణం

కొత్తగూడెం/జూలూరుపాడు/సుజాతనగర్, ఫిబ్రవరి 22 ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో శనివారం సాయంత్రం గాలిదుమారంతో వర్షం కురిసింది. వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. గాలివానతో మిర్చి, మామిడి రైతులు ఆందోళన చెందారు. కొత్తగూడెం, పాల్వంచ, జూలూరుపాడు, సుజాతనగర్, చంద్రుగొండ, టేకులపల్లి, ఇల్లెందు, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి తదితర మండలాల్లో ఈదురు గాలులతో మోస్తారు వర్షం కురిసింది. వాతావరణం ఒక్కసారిగా మారడంలో కల్లాల్లో ఆరబోసిన మిర్చి తడుస్తుందనే ఆలోచనతో రైతులు మిర్చి పంటపై టార్పాల్స్ కప్పారు. పూత రాలుతుందని మామిడి రైతులు ఆందోళన చెందుతున్నారు. జూలూరుపాడు మండలంలోని పలు గ్రామాల్లో శనివారం సాయంత్రం అకాల వర్షం కురిసింది. జూలూరుపాడు, వెంగన్నపాలెం, గుండెపుడి, బేతాళపాడు, పాపకొల్లు తదితర గ్రామాల్లో కల్లాల్లో ఆరబోసిన మిర్చి తడవకుండా కాపాడుకునేందుకు రైతులు వాటిపై పరదాలు కప్పారు. అయినా కొన్నిచోట్ల మిర్చిపంట తడిచింది. సుజాతనగర్ మండలంలో శుక్రవారం కురిసిన అకాల వర్షంతో దెబ్బతిన్న మొక్కజొన్న పంటను మండల వ్యవసాయాధికారి జి.నర్మద శనివారం పరిశీలించారు. శుక్రవారం మండలంలో ఈదురు గాలులతో, అకాల వర్షం కురిసింది. దాంతో సింగభూపాలెం గ్రామంలో మొక్కజొన్న పంట నేలకొరింది. ఈ విషయాన్ని రైతులు స్థానిక వ్యవసాయాధికారికి సమాచారం అందించగా శనివారం వ్యవసాయాధికారులు నేలకొరిగిన మొక్కజొన్న పంటలను పరిశీలించారు. నష్టాన్ని అంచనా వేసి ఉన్నతాధికారులకు సమాచారం అందిస్తానన్నారు. ప్రభుత్వం ఏదైనా సహాయం అందిస్తే బాధిత రైతులకు తెలియజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రైతుల ఎర్రబోయిన సత్యన్నారాయణ, అభిరామ్, బడుగుల శివ, చిమట నాగేశ్వరరావు, బైరు మల్లికార్జునరావు, పగడాల యాలాద్రి, ఉగ్గం రమేష్, నర్సింహారావు, సాయిన్ని పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.


దెబ్బతిన్న మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న సుజాతనగర్ మండల వ్యవసాయాధికారి నర్మద

గూడెంలో కోల్ ఇండియా అథ్లెటిక్స్ పోటీలు

ప్రారంభించిన సింగరేణి డైరెక్టర్ (ఈఅండ్ఎం) సత్యనారాయణ

కొత్తగూడెం టౌన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో శనివారం కోల్‌ఇండియా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు కనుల పండుగగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను సింగరేణి ఈఅండ్ఎం డైరెక్టర్ డి.సత్యనారాయణరావు శనివారం ప్రారంభించారు. ప్రకాశం స్టేడియం గ్రౌండ్‌లో నిర్వహించిన ఈ పోటీలకు కోల్ ఇండియాలోని 9 బొగ్గు కంపెనీలకు చెందిన క్రీడాకారులు హాజరయ్యారు. సింగరేణి జెండాను ఆవిష్కరించిన అనంతరం ఒలింపిక్ జ్యోతిని వెలిగించి బెలూన్లను ఎగురవేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ సత్యనారాయణ క్రీడాకారులచే గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించేందుకు సింగరేణి వేదికను తయారు చేస్తోందన్నారు. క్రీడాకారులు గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని, ఓటమి చెందినా నిరుత్సాహ పడకుండా మళ్లీ విజయం కోసం పట్టుదలను పెంపొందించుకోవాలని ఆకాంక్షించారు. క్రీడలు స్నేహపూర్వక వాతావరణాన్ని పెంపొందిస్తాయన్నారు. క్రీడలను ప్రోత్సహించడంలో సింగరేణి యాజమాన్యం ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. కోల్‌ఇండియా స్థాయి అథ్లెటిక్స్ పోటీలను సింగరేణి నిర్వహించడం హర్షనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని పోటీలు నిర్వహించేందుకు సింగరేణి ముందుంటుందని తెలిపారు. దేశ నలుమూలల నుంచి 9 బొగ్గు కంపెనీలకు సంబంధించి సుమారు 300మంది క్రీడాకారులు పోటీలకు హాజరుకావడం అభినందనీయమన్నారు. క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యం జరగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ (పర్సనల్) కవితానాయుడు, డీజీఎంలు రాజేంద్రప్రసాద్, అజయ్‌కుమార్, రాజీవ్‌కుమార్, గుర్తింపు, ప్రాతినిధ్య కార్మికసంఘం నాయకులు మిర్యాల రంగయ్య, త్యాగరాజన్‌తో పాటు వివిధ ఏరియాల క్రీడల అధికారులు పాల్గొన్నారు.


ఆర్చరీ పోటీలో పాల్గొన్న క్రీడాకారులు


అథ్లెటిక్స్ జ్యోతిని వెలిగించి క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న సింగరేణి ఈఅండ్ఎం డైరెక్టర్ సత్యనారాయణరావు

తొలిరోజు విజేతలు వీరే...

కొత్తగూడెంలోని సింగరేణి ప్రకాశంగ్రౌండ్‌లో నిర్వహిస్తున్న కోల్‌ఇండియాస్థాయి అథ్లెటిక్స్ పోటీలో వివిధ బొగ్గు కంపెనీలకు చెందిన క్రీడాకారులు తమ ప్రతిభను కనబర్చారు. మొదటి రోజు విజేతల వివరాలిలా ఉన్నాయి.. ఆర్చరీ విభాగంలో సింగరేణికి సంబంధించిన అఖిల్ (ప్రథమ బహుమతి) (మిగతా 6వ పేజీలో)

పగలు తోడేస్తారు.. రాత్రి తరలిస్తారు

- మున్నేరులో బరితెగిస్తున్న ఇసుక మాఫియా
- అధికారులకు తలనొప్పిగా ఇసుకాసురుల తీరు
- మైనింగ్ అధికారుల ఉదాసీనత.. ఆగని దందా

6


పెద్దమండవ వద్ద మున్నేరులో ఇసుకను ట్రాక్టర్లలోకి ఎత్తుతున్న కూలీలు



భద్రాద్రి రామయ్యకు స్వర్ణ తులసార్చన

భద్రాచలం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి వారికి ఆర్జిత సేవలో భాగంగా శనివారం స్వర్ణ తులసార్చన నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే స్వామివారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, వేద ఆశీర్వచనం నిర్వహించారు.



చూసుకో పదిలంగా..
హృదయాన్ని అద్దంలా..
ఆకట్టుకుంటున్న వాల్ పెయింటింగ్స్

ఒకే గుండె ఒకే జీవితం..! కిడ్నీలను పరిశుభ్రంగా ఉంచుకోండి..! ఆక్సిజన్ కోసం మొక్కలు నాటండి అంటూ..! ప్రజలను ఆలోచింప చేసే విధంగా గోడ చిత్రాలు ఆకట్టుకుంటున్నాయి. ఖమ్మం జిల్లా జనరల్ ఆస్పత్రి గోడలపై కార్పొరేషన్ అధికారులు చిత్రాలు వేయించారు. గుండెను పదిలంగా ఉంచుకోవాలి... ఆక్సిజన్ కోసం చెట్లను విరివిగా నాటాలి అంటూ... తరచుగా నీటిని సేవిద్దాం.. కిడ్నీ లను కాపాడుకుందాం అంటూ వేసిన చిత్రాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి...!

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం కలెక్టరేట్







అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేష్, శ్రీనివాసరావు

హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

- మార్చి 5 నుంచి 11 వరకు జిల్లా కేంద్రాల్లో ఉద్యమాలు
- రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులుగా వెంకటేష్, శ్రీనివాసరావు
- ముగిసిన టీయూసీఐ హమాలీల రాష్ట్ర 4వ మహాసభలు

ఖమ్మం సంక్షేమ విభాగం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): హమాలీల సంక్షేమానికి ప్రత్యేకంగా సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, హమాలీల సమస్యలపై మార్చిలో ఉద్యమ కార్యాచరణకు నిర్ణయాలు చేశామని టీయూసీఐ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన సీ.వెంకటేష్, కార్యదర్శి డి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. టీయూసీఐ అనుబంధ హమాలీ కార్మికుల రాష్ట్ర 4వ మహాసభలు శనివారం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో ముగిశాయి. రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శలతో పాటుగా ఉపాధ్యక్షులుగా జక్కుల యాకయ్య, కొయ్యల శ్రీనివాస్, సహాయ కార్యదర్శులుగా ఎన్.శ్రీనివాసులు, బీ.సీతారాములు, కోశాధికారిగా నర్సింహరావు, 21 మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహాసభల్లో ఆరు తీర్మానాలను ఆమోదించారు. మార్చి 5నుంచి 11 వరకు జిల్లా కేంద్రాల్లో, ఏప్రిల్ 9న రాష్ట్ర లేబర్ కమిషన్ ఎదుట ధర్నాలు చేయాలని నిర్ణయించారు.

క్రీడలతో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చు

జాతీయస్థాయి టెన్నిస్ పోటీల ప్రారంభోత్సవంలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మం స్పోర్ట్స్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): క్రీడలతో ఉన్నత శిఖారాలు అధిరోహించొచ్చని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో చల్లపల్లి రాధమ్మ మెమోరియల్ ఆల్ ఇండియా ఓపెన్ టెన్నిస్ పోటీలను ప్రారంభించడానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపోటములతో సంబంధం లేకుండా పోటీలలో ప్రతిభ చూపడానికి కృషి చేయాలని అన్నారు. టెన్నీస్ క్రీడ ఆడటం వల్ల ఫిజికల్ ఫిట్‌నెస్, శారీరక దృఢత్వం పెరుగుతుందని అన్నారు. ఆటలు జీవితంలో ఎన్నో అనుభవాలను నేర్పుతాయని పేర్కొన్నారు. మన దేశం నుంచి మరో లియాండర్‌పేస్, సానియా మీర్జా లాంటి టెన్నీస్ క్రీడాకారులు రావాలని ఆకాంక్షించారు. ప్రపంచంలో మన దేశం ఆర్థికంగా ఎదుగుతుందని దాంతో పాటు క్రీడాకారులు క్రీడల్లో కూడా రాణించి విశ్వ వ్యాపత్తంగా దేశానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని అన్నారు. అనంతరం మొదటి మ్యాచ్‌ను కర్ణాటకకు చెందిన ఆర్యన్‌మెహతా, మహారాష్ట్రకు చెందిన ఆదిత్యరానావడే క్రీడాకారుల మధ్య పోటీని టాస్ వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ కొద్ది సేపు టెన్నీస్ ఆడి సందడి చేశారు. డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి, జిల్లా టెన్నీస్ అసోసియేషన్ బాధ్యులు మద్దినేని వెంకటరమణ, చల్లపల్లి శ్రీనివాస్, డాక్టర్ అనిల్, ట్రెజరర్ కాంపాటి సత్యనారాయణ, ఏసీపీ కుమారస్వామి, ట్రాఫిక్ సీఐ కుమారస్వామి, ఛీప్ రిఫరీ ప్రవీణ్‌నాయక్, స్టేడియం టెన్నీస్ కోచ్ కైలాష్, కాశ్యపాపారావు, రమేష్, సూర్య తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్


టెన్నిస్ ఆడుతున్న కలెక్టర్

కనుమరుగు కానున్న పురాతన భవనం

దుమ్ముగూడెం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): దుమ్ముగూడెంలో కోట్ల సన్యాసయ్య నాయుడు 160 ఏళ్ల క్రితం అత్యద్భుతంగా నిర్మించిన పురాతన భవనాన్ని కూల్చివేయాలని ఆర్‌అండ్‌బీ ఈఈ లాల్‌సింగ్ శనివారం సిఫారసు చేశారు. భవనం శిథిలావస్థకు చేరడంతో పరిసర ప్రజలకు ప్రమాదం కలుగుతుందని గుర్తించిన తహసీల్దార్ అశోక్‌కుమార్ దాని స్థితిగతులను పరిశీలించాలని ఆర్‌అండ్‌బీ శాఖకు లేఖ రాశారు. దీంతో డీఈ హరిలాల్ శనివారం భవనాన్ని పరిశీలించి ప్రమాదకరస్థితిలో ఉందని గుర్తించి ఈఈకి నివేదిక ఇచ్చారు. కాగా 1870నాటి కాలంలో బర్మా నుంచి టేకు కలపతో అన్ని హంగులతో విలాసవంతంగా నిర్మించిన ఈ పురాతన భవనంగా భద్రాచలం డివిజన్‌లోనే అద్భుత నిర్మాణంగా పేరొందింది. భవన యజమానులు వృత్తి, వ్యాపారాల నేపథ్యంలో ఇంటిని ఖాళీ చేసి ఇతర పట్టణాల్లో నివాసముంటున్నారు. ఎవరికీ ఇబ్బంది కలగకుండా కూల్చివేయాలని భవన యజమానులు దరఖాస్తు చేసినట్లు తహసీల్దార్ తెలిపారు.



ఎన్నికల విధులను పకడ్బందీగా నిర్వహించాలి

- భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ జితేష్

కొత్తగూడెం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల విధులను పకడ్బందీగా నిర్వహించాలని భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సిబ్బందికి సూచించారు. శనివారం ఐడీవోసీ కార్యాలయ సమావేశ మందిరంలో ఈ నెల 27న జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పీవో, ఏపీవోలకు రెండో విడత శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణ తరగతుల్లో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఎన్నికల సిబ్బందికి పోలింగ్ పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఎన్నికల ముందు రోజే సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్నికల సూపరింటెండెంట్లు దార ప్రసాద్, రంగ ప్రసాద్, మాస్టర్ ట్రైనీ సాయికృష్ణ పాల్గొన్నారు.

పేదల కోసం పోరాడేది ఎర్రజెండానే

- కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు
- చిక్కుడుగుంతలో అమరవీరుల స్థూపం ఆవిష్కరణ


మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి

మణుగూరు టౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడేది ఎర్రజెండా మాత్రమేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం మణుగూరు మండలంలోని చిక్కుడుగుంత గ్రామంలో పార్టీ వందేళ్ల పండుగలో భాగంగా ఫైసా కొండయ్య భవనం ప్రాంగణంలో అమరవీరుల స్మారక స్తూపాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్రనేత బీ అయోధ్య, జిల్లా కార్యదర్శి షాబీర్‌పాషాలు పాల్గొని ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభకు మాజీ ఎంపీటీసీ కామిశెట్టి రామారావు అధ్యక్షత వహించగా కూనంనేని మాట్లాడారు. స్వాతంత్రం రాకముందే కమ్యూనిస్టులు అంటరానితనం నిర్మూలనపై, దున్నే వాడిది భూమి అంటూ అనేక ఉద్యమాలను, పోరాటాలను సాగించారని తెలిపారు. అనంతరం రాష్ట్ర నేత బీ అయోధ్య, జిల్లా కార్యదర్శి షాబీర్ పాషాలు మాట్లాడారు. కార్యక్రమంలో బీటీపీఎస్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రావుల మురళి, కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, జిల్లా కార్యవర్గ నాయకులు సరెడ్డిపుల్లారెడ్డి, మున్నా లక్ష్మీకుమారి, పాల్వంచ నాయకులు సాయిబాబా, స్థల దాత ముక్కు నర్సారెడ్డి, పి.నాగేశ్వరరావు, ఎస్‌కే.సర్వర్, సోందె కుటుంబరావు, రాయల బిక్షం, ఎడారి రమేష్, బాడిస సతీష్, లక్ష్మయ్య, జీ.వెంకటేశ్వర్లు, సమ్మక్క, నిర్మల, సుజాత, తోట రమేష్, రమేష్, రామారావు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో జిల్లాకు పతకాల పంట

ఖమ్మం స్పోర్ట్స్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో నగరానికి చెందిన క్రీడాకారులు సత్తా చాటి మొత్తం 12 పతకాలు సాధించారు. సర్దార్ పటేల్ స్టేడియంలో నిత్యం సాధన చేసే క్రీడాకారులు వైశాలి రెండు స్వర్ణ పతకాలు సాధించగా, బింధు రెండు కాంస్య, హజీరాఫాతిమా రెండు స్వర్ణ పతకాలు, అమీనీనాజ్ రజతం, కాంస్యం, ఆఫ్తాబ్ స్వర్ణ, కాంస్యం, వేణు స్వర్ణ, రజత పతకాలు సాధించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి, అథ్లెటిక్స్ కోచ్ గౌస్, అథ్లెటిక్ సంఘం జిల్లా కార్యదర్శి షఫీక్ అహ్మద్‌లు అభినందించారు. భవిష్యత్ పోటీల్లో రాణించి ఖమ్మం జిల్లాకు ఖ్యాతిని తీసుకురావాలని ఆకాంక్షించారు.

పగలు తోడేస్తారు.. రాత్రి తరలిస్తారు



ముదిగొండ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు మారినా, విధివిధానాలు మారినా ఇసుక మాఫియా ఆగడాల్లో మాత్రం మార్పు రావడం లేదు. అడ్డగోలు సంపాదనకు అలవాటుపడ్డ కొందరు బరితెగించి ఇసుకను యథేచ్ఛగా తరలించిపోతున్నారు. ఎన్నిసార్లు దాడులు చేసినా ఇసుక మాఫియా భయపడకపోగా బెదిరింపులకు దిగుతూ అధికారులకు తలనొప్పిగా మారుతోంది. యథేచ్ఛగా పగలు తోడేసి... రాత్రి ఇతర ప్రాంతాలకు తరలిస్తూ ఇసుక వ్యాపారం మూడుపువ్వులు ఆరుకాయలుగా సాగిస్తున్నారు. ఇసుక అక్రమ వ్యాపారానికి అడ్డూ అదుపూ లేకపోవడంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. తీవ్రస్థాయిలో చర్యలు ఉంటే తప్ప ఈ అక్రమం ఆగేలా కనిపించడం లేదు.

మున్నేరులో బరితెగింపు..

ముదిగొండ మండలంలోని గ్రంధసిరి, పెద్దమండవ ప్రాంతాల్లో మున్నేరు నుంచి ఈ అక్రమ రవాణా సాగుతోంది. పగలు తోడుతూ రాత్రి సమయాల్లో వందల ట్రాక్టర్లతో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. కొంతమంది ఇసుకను ఇళ్లల్లోనే డంప్ చేసి ఇసుకాసురులు బరితెగించి బహిరంగ విక్రయాలకు పాల్పడుతున్నారు. ఒక్కో ట్రాక్టర్ టక్కు రూ.5,500నుంచి రూ.7వేల వరకు డిమాండ్‌ను బట్టి విక్రయిస్తున్నారు. అధికారులు ఎన్నిసార్లు దాడులు చేసినా వారిపై బెదిరింపులకు దిగుతూ వారికి ఇక్కడ ఇసుక మాఫియా తలనొప్పిగా మారింది. ఇక్కడ ఇసుక అక్రమరవాణా ఆగడం అంత తేలికయ్యే పని కాదు. అధికారులు తీవ్ర స్థాయిలో చర్యలు తీసుకుంటే తప్ప అక్రమం ఆగదని పలువురు పేర్కొంటున్నారు. ఓ పక్క ఇసుక మాఫియా ట్రాక్టర్లతో రాత్రి వేళల్లో అతి వేగంగా ఇసుకను తరలిస్తుండటంతో ఆయా గ్రామాల ప్రజలకు కునుకు లేకుండాపోతోంది. ఇసుకను అక్రమంగా తరలిస్తుండటంతో ప్రభుత్వానికి కూడా భారీగా గండి పడుతోంది. ఇంత జరుగుతున్నా సంబంధిత మైనింగ్ అధికారులు తమకేమీ సంబంధం లేనట్లుగా వ్యవహరిస్తుండటంతో ఇష్టానుసారంగా ఈ అక్రమ వ్యాపారం సాగుతోంది. ఈ అక్రమ రవాణాపై సరైన చర్యలు లేకపోవడం వల్లనే స్థానిక అధికారులకు తలనొప్పిగా మారింది. సంబంధిత మైనింగ్, పోలీసు, రెవెన్యూ, రవాణాశాఖల అధికారులు సమన్వయం పనిచేస్తే ఈ అక్రమ వ్యాపారానికి అడ్డుకట్ట వేయవచ్చని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఒక్కసారికి వదిలేయండి

"దండం పెడతాం.. కాళ్లు పట్టుకుంటున్నాం" ఈ ఒక్కసారి క్షమించి తమను వదిలివేయాలని ముదిగొండ మండలం పెద్దమండవ మున్నేరు పరివాహక ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుకరవాణా చేపడుతున్న ట్రాక్టర్ యజమానుల భార్యలు శనివారం తహసీల్దార్ సునీత ఎల్జిబెత్‌ను వేడుకున్నారు. ఇసుక అక్రమ రవాణా చేపడుతున్నారనే సమాచారంపై పెద్దమండవ మున్నేరు పరివాహక ప్రాంతంలో తహసీల్దార్ సునీతా ఎల్జిబెత్ తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా మూడు ఇసుక ట్రాక్టర్లను సీజ్‌చేసి స్టేషన్‌కు తరలిస్తుండగా తమను వదిలివేయాలంటూ ట్రాక్టర్ యజమానుల భార్యలు తహసీల్దార్ కాళ్లు పట్టుకోబోయారు. దీంతో తహసీల్దార్ పక్కకు తప్పుకొని వెళ్లిపోయారు. అనుమతులు ఇచ్చేంతవరకు ఇసుక రవాణా చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ ప్రసన్నకుమార్, కానిస్టేబుల్ లక్ష్మణ్ పాల్గొన్నారు.

చర్యలు తీసుకుంటాం

సునీత ఎల్జిబెత్, తహసీల్దార్ ముదిగొండ

ముదిగొండ మండలం గ్రంధసిరి, పెద్దమండవ ప్రాంతాల్లో మున్నేరు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించి ట్రాక్టర్లను పట్టుకుంటున్నాం. రాత్రి వేళల్లో ఎక్కువగా ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడేవారిపై చర్యలు తీసుకుంటాం. ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు ఈనెల 27నుంచి ఇసుక కూపన్లు జారీ చేస్తాం. కూపన్లు ఇచ్చిన తర్వాత అక్రమ రవాణాకు పాల్పడితే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదు. పోలీసు, రెవెన్యూశాఖల సమన్వయంతో దాడులు నిర్వహిస్తూనే ఉన్నాం.

కనకగిరిలో.. కనులవిందు

(5వ పేజీ తరువాయి)

ఎత్తైన ఈ కొండలు విస్తరించి ఉన్నాయి. ఈ కొండల్లో 14 చిరుతలు, 10 ఎలుగుబంట్లతో పాటు వేల సంఖ్యలో దుప్పులు, జింకలు, అడవిగొర్రెలు, అడవిదున్నలు, మనుబోతులు, అడవిపిల్లులు, నక్కలు, ఇలా పలురకాల అటవీ జంతువులతో పాటు తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా కనువిందుచేసే పక్షిజాతులు బ్లూ ఇయర్ కింగ్‌ఫిషర్, వైట్ రంఫ్‌డ్ క్షమాపక్షి, ఇండియన్ ప్యారడైజ్ ఫ్లైకేచర్ ఈ కనకగిరి గుట్టల్లో ఉన్నాయి. బంగారాన్ని మరిపించేలా విస్తరించి ఉన్న పచ్చని వెదురు పర్యాటకులను ఆకర్షిస్తుంది.

చూడదగిన ప్రదేశాలెన్నో..

కనకగిరి గుట్టలపై ఆహ్లాదం కలిగించే చూడదగిన ప్రదేశాలు అనేకం ఉన్నాయి. ఊటీ, కొడైకెనాల్, కూనూరు కొండలను తలపించేలా ఎత్తైన, లోతైన కొండలు విస్తరించి ఉన్నాయి. అయితే వేసవిలో ఎండవల్ల పర్యాటకులకు కొంత ఇబ్బంది కలిగే అవకాశం ఉంది. వర్షాకాలం నుంచి ఫిబ్రవరి వరకు ఈ కొండలను తిలకించవచ్చు. ఖమ్మం జిల్లా తల్లాడ, సత్తుపల్లి రహదారిలోని కల్లూరు మండలం రామకృష్ణాపురం నుంచి పులిగుండాల వరకు 12కిమీ వెళితే కనకగిరి కొండల అటవీప్రాంతానికి చేరుకోవచ్చు. అక్కడి నుంచి పులిగుండాల రిజర్వాయర్‌కు చేరుకోవచ్చు. ప్రస్తుతం పులిగుండాల రిజర్వాయర్‌లో బోటింగ్ ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక్కడనుంచి 3కి.మీల దూరంలో 'పులిగుండం' అనే ప్రదేశంలో వాటర్‌ఫాల్ ఉంది. అయితే ఈ వాటర్‌ఫాల్ ఫిబ్రవరి వరకే ఉంటుంది. ప్రస్తుతం ఎండలు ఎక్కువైనందున నీరు నిలిచిపోయింది. ఇక్కడికి వెళ్లాంటే మూడు కిలోమీటర్లు నడిచి వెళ్లాల్సి ఉంటుంది. అక్కడనుంచి సఫారీ వాహనాల ద్వారా కనకగిరి గుట్టల శిఖరానికి 570మీటర్ల ఎత్తుకు వెళ్లాలి. అయితే ప్రస్తుతం అటవీశాఖ వాహనాల్లోనే పర్యాటకులను అక్కడికి తీసుకెళ్తున్నారు. ఇందుకోసం ప్రత్యేక వాహనాలు కొనుగోలు చేయబోతున్నారు. అక్కడ కాకతీయుల కాలంలో చుట్టూ గోడ నిర్మించారు. ఈ ఎత్తైన కొండనుంచి శత్రువుల రాకను ఆ రోజుల్లోనే పసిగట్టేవారు. ఇక్కడ వీరభద్రస్వామి ఆలయం కాకతీయుల కాలంలో నిర్మించగా అది శిథిలమవ్వడంతో కొందరు 1959లో మళ్లీ చిన్న ఆలయంగా నిర్మించారు. శివరాత్రి రోజు ఇక్కడ కళ్యాణం జరుగుతుంది. పల్లెర్ల వీరభద్రస్వామిగా కొలువుదీరి ఉన్న వీరభద్రస్వామి, భద్రకాళి సమేతుడై ఉండడంతో ఇక్కడ కోరుకున్న కోరికలు నెరవేరుతాయని భక్తుల్లో విశ్వాసం ఉంది. ఈ కొండలను సందర్శించి కొండలపైకి ఎక్కి వీరభద్రస్వామి సందర్శనతో పాటు కొండలను తిలకించేందుకు జంగిల్ వ్యూ ఏర్పాటుచేశారు. వెదురుతో ప్రత్యేకంగా మంచెలు నిర్మించారు. దీనిపైకి ఎక్కి ఎత్తైన కొండలు, రిజర్వ్‌ఫారెస్టు తిలకించే ఏర్పాటుచేశారు. కాకతీయుల కాలంలో ఇక్కడ బండరాళ్లతో బావిని తవ్వారు. ఆ బావిలో వేసవిలో కూడా నీరు ఉండడం ప్రత్యేకత. ఏనుగులు, గుర్రాలు, సైనికులు కూడా ఈ కొండలపైనే ఉండేవారని, కాకతీయ చరిత్రకారులు ఉండేవారని, కాకతీయుల కాలంలో ఇక్కడినుంచే శత్రువులపై నిఘా ఉండేదని సమాచారం. మొత్తం 50 కొండలతో విస్తరించి ఉన్న కనకగిరి కొండలకు ప్రతి కొండకు ఒక ప్రత్యేకత ఉంది. కింద కొండలోని పాలకోయ లొద్ది వద్ద 18 హస్తాలు, 18అస్త్రాలతో ఉన్న వీరన్నస్వామి విగ్రహం ఇక్కడ ప్రత్యేక ఆకర్షణగా ఉంది. ఇది కూడా ఆధ్యాత్మిక విశిష్టతతో కాకతీయులకాలంలోనే ఏర్పాటుచేశారు. పులిగుండాల రిజర్వ్‌ఫారెస్టు వద్ద శివాలయం కూడా కాకతీయులు ఏర్పాటు చేశారు. ఇవన్నీ కాకతీయుల నాటి నిర్మాణానికి ఆధ్యాత్మిక వైభవానికి సాక్ష్యాలుగా కనకగిరి గుట్టల్లో కనిపిస్తున్నాయి. ఈ గుట్టల ప్రాంతాన్ని ప్రతిరోజు పర్యాటకులు సందర్శించేలా ప్రత్యేకంగా వెదురు ఇళ్లు, మంచెల నిర్మాణం కూడా చేస్తున్నారు సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు ఈ కొండ కోనల్లో పర్యాటకులకు కనువిందు చేసేలా అటవీశాఖ, పర్యాటకశాఖ సంయుక్తంగా ఏర్పాట్లు చేస్తోంది.

వచ్చే ఏడాది నాటికి పూర్తి

సిద్దార్థ విక్రమ్‌సింగ్, ఖమ్మం జిల్లా అటవీశాఖ అధికారి



కనకగిరిగుట్టల్లోని ఎకో టూరిజం కేంద్రాలను పర్యాటకులు ఆకర్షించేలా తీర్చిదిద్దుతున్నాం. వచ్చే వానాకాలం నాటికి అన్ని పనులు పూర్తవుతాయి. తెలంగాణ-ఆంధ్రా పర్యాటకులను ఆకర్షించేలా విస్తృతంగా ప్రచారం చేయయబోతున్నాం. పులిగుండాల రిజర్వాయర్‌లో బోటింగ్ కోసం బోట్లు కొనుగోలు చేస్తున్నాం. అలాగే కొండలు ఎక్కేందుకు జంతువులు, పక్షులు తిలకించేందుకు సఫారీ వాహనాలు ఏర్పాటుచేస్తాం. అటవీ ఉత్పత్తులు అటవీమొక్కలు, ఔషధమొక్కల గురించి తెలియచేయడంతో పాటు అటవీ ఉత్పత్తులతో ఆహారం అందించేందుకు ఫుడ్‌కోర్టు ఏర్పాటు చేస్తున్నాం. టెంపుల్ టూరిజంను ప్రోత్సహించేందుకు ఖమ్మం జిల్లా అటవీశాఖ కనకగిరిగుట్టల ఎకో టూరిజం ప్రాజెక్టునను చేపట్టింది. ఇది తెలంగాణ రాష్ట్రానికే ఆకర్షణగా నిలవబోతోంది. వచ్చే ఏడాది సీజన్ నాటికి పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించి పర్యాటకులను ఆకర్షించేలా కనకగిరి ఎకో టూరిజం ప్రాజెక్టును తీర్చి దిదుతున్నాం.

కిట్లు లేవు.. డబ్బులు రావు!

(5వ పేజీ తరువాయి)

నిలిచిపోయాయి. ప్రస్తుతం ప్రసవం చేసుకున్నవారికి మాతాశిశు కిట్లు మాత్రమే అందచేస్తున్నారు. అవి కూడా రెండు నెలలుగా నిండుకున్నాయి. నగదు మాత్రం అస్సలు రావడం లేదు. ఖమ్మం జిల్లాలో రూ.50కోట్లకు పైగానే ప్రోత్సాహకాల బకాయిలు ఉన్నట్లు తెలుస్తోంది. గర్భిణులు బాలింతలు ఈ డబ్బుల కోసం అంగన్‌వాడీ, బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు.

ప్రభుత్వ దవాఖానాలో జన్మించిన వారికి గత రాష్ట్ర ప్రభుత్వం కేసీఆర్ కిట్లు పంపిణీ చేసింది. పుట్టిన శిశువుకు ఉపయోగపడే రూ.2వేల విలువగల వివిధ రకాల వస్తువులు అందజేశారు. ఇటీవల కొలువుదీరిన కొత్త ప్రభుత్వంలో మాతా, శిశు కిట్టుగా నామకరణం చేసి ఉన్న కిట్లను ఆసుపత్రిలో ప్రసవించిన తల్లులకు అందజేశారు. అవి అయిపోయి ఆరు నెలలు గడుస్తున్నా కిట్లు సరఫరా చేయడంలేదు. ఇప్పటికీ మూడు నెలలుగా తల్లులు వాటికోసం ఎదురుచూస్తున్నారు. కిట్లు వస్తాయా? రావా? అనే విషయంలోనూ ఉన్నతాధికారులకు స్పష్టత లేదు. వీటిపై పలువురు బాలింతల బంధువులు ఆరా తీస్తున్నారు. అంతే కాదు పీహెచ్‌సీల్లో, సీహెచ్‌సీల్లో గర్భిణులను ప్రోత్సహించేందుకు కనీసం కిట్లు కూడా రాకపోవడంతో వారికి నచ్చజెప్పలేకపోతున్నారు. దీంతో గర్భిణులు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు.

రెండు నెలలుగా 613 మంది ఎదురుచూపు..

మూడు నెలలుగా మాతా, శిశు కిట్లు అందించడంలేదు. సుమారు 613 మంది వరకు తల్లులు ఈ కిట్లకోసం ఎదురుచూస్తున్నారు. తల్లికి చీరతోపాటు శిశువుకు ఉపయోగపడే సబ్బులు, మెత్త, పరుపు, దిండు, నూనె, పౌడర్, షాంపు, దోమతెర మొత్తం రూ.2వేల విలువ గల 15రకాల వస్తువులు అందులో ఉన్నాయి. ప్రసవించిన రెండోరోజే కిట్ తీసుకొని అందులోని వస్తువులను వాడుకునేవారు. ప్రస్తుతం అవి అందించకపోవడంతో బయట డబ్బు చెల్లించి కొనుక్కుంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కిట్లు అందించాలని తల్లులు కోరుతున్నారు. మాతా, శిశు కిట్ ఉన్న వాటిని అందజేశాం. కొత్తవి రాలేదు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నామని ఆసుపత్రి అధికారులు చెబుతున్నారు.

గూడెంలో కోల్ ఇండియా అథ్లెటిక్స్ పోటీలు

(5వ పేజీ తరువాయి)

సాధించగా డబ్ల్యుసీఎల్‌కు కంపెనీకి చెందిన నికీల్‌కు (ద్వితీయ బహుమతి), సీఈసీఎల్ కంపెనీకి సంబంధించిన షెడకుమార్‌కు (తృతీయ బహుమతి)లభించింది. 100మీటర్ల మహిళ పరుగు పందెం విభాగంలో ఎంసీఎల్ కంపెనీకి చెందిన ప్రియా హోరం (ప్రథమ), సీసీఎల్ కంపెనీకి చెందిన డాక్టర్ సుదిసన్ మండల్ (ద్వితీయ), సింగరేణికి సంబంధించిన సుస్మాకు (తృతీయ బహుమతి) లభించింది. 400 మీటర్ల పరుగుపందెంలో ఎంసీఎల్‌కు చెందిన ప్రియా ఓరం (ప్రథమ బహుమతిని) సాధించగా ఎంసీఎల్ కంపెనీకి చెందిన త్రిప్తి పూరి (ద్వితీయ బహుమతి), సీఈఎల్‌కు చెందిన రుక్మిణ (తృతీయ బహుమతి సాధించింది.) డిస్కస్ త్రో మహిళ విభాగంలో సింగరేణి కంపెనీకి చెందిన మాన్వితకు (ప్రథమ బహుమతి), ఎంసీఎల్‌కు చెందిన హిందుబాలాకు (ద్వితీయ బహుమతి, సీసీఎల్‌కు చెందిన పింకి నహర్‌కు (తృతీయ బహుమతి) లభించింది. ట్రిపుల్ జంప్ పురుష విభాగంలో సీసీఎల్ కంపెనీకి చెందిన సంతుపటాస్ (ప్రథమ బహుమతి సాధించగా) సీసీఎల్ కంపెనీకి చెందిన అవినాస్ (ద్వితీయ), ఎన్‌సీఎల్‌కు చెందిన అభిమాన్యు బాటియా (తృతియ బహుమతి), హైజంప్ పురుషుల విభగంలో దీపక్‌కుమార్ ప్రథమ బహుమతి సాధించగా ఎస్‌సీసీఎల్‌కు చెందిన రూపేష్‌కు ద్వితీయ బహుమతి, ఎన్‌సీఎల్ కంపెనీకి చెందిన రింకుఉరఫ్ నయింబాబు తృతీయ బహుమతి సాధించాడు.


పరుగుపందెంలో పాల్గొన్న క్రీడాకారులు

రీడింగ్ రూమ్స్ ఏర్పాటు చేయాలి

» స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ



మాట్లాడుతున్న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ప్రతి మండలంలో రెండు పాఠశాలల్లో రీడింగ్ రూంలు ఉండే విధంగా ఏర్పాట్లు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. శ్రీజ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ఆమె తన ఛాంబర్ లో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యార్థులకు పుస్తక పఠనం పై ఆసక్తి కలిగేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి మండలంలో రెండు పాఠశాలలను ఎంపిక చేసి, రీడింగ్ రూమ్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రంథాలయ సంస్థకు రావాల్సిన సెస్ వసూలుపై దృష్టి పెట్టాలన్నారు. గ్రంథాలయాల మరమ్మతులు, అభివృద్ధిపై దృష్టి పెట్టాలన్నారు. నిధుల లేకపోవడంతో నిలిచిన పనులను అందుబాటులో ఉన్న నిధులతో పూర్తి చేయాలన్నారు. గ్రంథాలయం ద్వారా గత సంవత్సర నిధుల కేటాయింపు, ఖర్చు, రాబోయే సంవత్సరం నిధుల ప్రతిపాదనలు సమగ్రంగా అన్ని వివరాలతో రూపొందించి, వారంలో సమావేశాన్ని ఏర్పాటుచేసి, సభ్యుల తీర్మానం తర్వాత ఆమోదానికి పంపాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాధికారి సోమశేఖరశర్మ, జిల్లా పంచాయతీ అధికారిణి ఆశాలత, జిల్లా గ్రంథాలయ సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ మాసంలో ఎలాంటి ఇబ్బందులు రావొద్దు

» భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్

కొత్తగూడెం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మార్చి రెండో తేదీ నుంచి ప్రారంభమయ్యే రంజాన్ మాసానికి అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆదేశించారు. రంజాన్ మాసంలో చేయవల్సిన ఏర్పాట్లపై శనివారం ఐడీవోసీ కార్యాలయ సమావేశ మందిరంలో మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ అధ్యక్షతన వివిధ శాఖల అధికారులు, ముస్లిం తమ పెద్దలతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లాలోని అన్ని మసీదుల వద్ద పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. రంజాన్ పర్వదినం రోజు సరిపడ పాలు అందుబాటులో ఉండేలా విజయ డెయిరీ అధికారులతో మాట్లాడి ఏర్పాటు చేయాల్సిందిగా సీపీవో సంజీవరావు ఆదేశించారు. జిల్లాలోని అన్ని మసీదులు, వాటి మత పెద్దల వివరాలను అందజేయాలని కలెక్టర్ కోరారు.



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

జమలాపురం శ్రీవారికి సర్వాంగాభిషేకం

ఎర్రుపాలెం, ఫిబ్రవరి22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీవారికి సర్వాంగాభిషేకం నిర్వహించి ముత్యాలకవచ అలంకారంలో భక్తులకు దర్శ నం కలిపించారు. ఆలయ అర్చకుడు ఉప్పల రాజీవ్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యే క పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈవో కొత్తూరు జగన్మోహ్మన్‌రావు, ఆలయ ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, సూపరింటెండెంట్ కె.విజయకుమారి, జూనియర్ అసిస్టెంట్ ఇరకుల పాటి కృష్ణప్రసాద్, అర్చకులు రాజీవ్‌శర్మ, సుదర్శన్‌శర్మ, మురళీమోహన్‌శర్మ, వెంకటేశ్వర సేవా సమితి నిర్వాహకులు ఎల్వీ నారాయణరెడ్డి పాల్గొన్నారు.



భక్తులకు తీర్థప్రసాదాలు అందిస్తున్న అర్చకుడు రాజీవ్‌శర్మ

నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేయాలి

» ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్

మణుగూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): భద్రాచలం ఐటీడీఏ పీవో బి. రాహుల్ శనివారం మణుగూరులో పర్యటించారు. గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో జరుగుతున్న అదనపు గదుల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. రూ. కోటి80 లక్షలతో చేపడుతున్న నిర్మాణాలు విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉండాలని, ఆరునెలల్లో పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం జీపీఎస్ పాఠశాలను సందర్శించి ఉద్దీపకం వర్క్ బుక్స్ సంబంధించిన పాఠ్యాంశాలను విద్యార్థులు చదుతువున్న తీరును, వారితో బోర్డుపై రాయించి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ చంద్రశేఖర్, డీఈ మధుకర్, ఏఈలు ప్రసాద్ యోగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల చదువును పరిశీలిస్తున్న పీవో

జీవో.3 పునరుద్ధరణకు కృషి చేయాలి

మణుగూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : జీవో నెం3 ను ఖచ్చితంగా పునరుద్ధరించాలని, ఏజేన్సీలో 100శాతం రిజర్వేషన్ సాధన జరగాలంటూ ఆదివాసీ ఐకాసా రాష్ట్ర నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం హైదరాబాద్ లోని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం కలిశారు. ఆదివాసీ సమస్యలు డిమాండ్లను నాయకులు వాసం రామకృష్ణ దొర, తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆలెం కోటి, ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలువాయి ఉషాకిరణ్ వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 100 శాతం రిజర్వేషన్ అమలు అయ్యే అర్డినెన్స్‌ను జారీ చేసే విధంగా కృషి చేయాలని కోరారు. నల్లమల అటవీ ప్రాంతంలోని చెంచు, పెంటి, గూడేల అభివృద్ధికి ప్రత్యేక నిదులను కేటాయించాలని కోదండరాంకు తెలిపారు. ఆదివాసీ నాయకులు ప్రస్తావించిన అంశాలపై కోదండరాం స్పందించి మార్చి మొదటి వారంలో రాష్ట్రంలోని అన్ని ఆదివాసీ సంఘాల ప్రతినిధులతో సెమినార్లు నిర్వహించి రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి దృష్టికి వీటిని తీసుకెళ్లి న్యాయం జరిగే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



కోదండరాంను కలిసిన ఆదివాసీ రాష్ట్ర నాయకులు

సీతమ్మకు బంగారు గాజుల వితరణ

భద్రాచలం ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి వారి ఆలయంలో హైదరాబాద్ జూబ్లీహిల్స్‌కు చెందిన డి.మహేందర్‌రెడ్డి, మంజుల దంపతులు సీతమ్మ వారికి బంగారు గాజులను అందించారు. శనివారం రాత్రి రామయ్యను దర్శించిన వారు ఈ సందర్భంగా స్వామివారికి 46 గ్రాముల బరువు ఉన్న 4 బంగారు గాజులు సమర్పించారు. ఈ బంగారు గాజులను దేవస్థానం పర్యవేక్షకులు కత్తి శ్రీనివాస్, లింగాల సాయిబాబాలకు లాంచనంగా అందజేశారు. ఈ బంగారు గాజుల విలువ రూ.3,70,070 ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవో సీసీ శ్రీనివాస్‌రెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఆలయ కమిటీ సభ్యులకు బంగారు గాజులను అందజేస్తున్న దాతలు

క్రమశిక్షణతో సంఘాలను పర్యవేక్షణ చేయాలి

» కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మం సంక్షేమ విభాగం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్‌లో మెప్మాలో ఎటువంటి ఆర్థిక ఆరోపణలు రాకుండా క్రమశిక్షణతో సంఘాలను పర్యవేక్షణ చేయాలని ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశించారు. శనివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'బ్యాంకులకు బురిడి' కథనంపై కమిషనర్ స్పందించారు. ఈ మేరకు కమిషనర్ అభిషేక్ అగస్త్య టీఎంసీ గుడిపూడి సుజాతరాణిని తన ఛాంబర్‌కు పిలిపించుకొని పలు ఆదేశాలిచ్చారు. 2020 నుంచి మెప్మాలో జరిగిన మహిళా స్వయం సహాయక సంఘాల అవినీతిపై వివరాలు తెలుసుకున్నారు. మహిళా సంఘాల్లోని సభ్యులు, బ్యాంకర్లు ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే అవినీతి చేసిన ఆర్పీలపై పోలీసు స్టేషన్‌లో కేసులు నమోదులు చేయించాలని ఆదేశించారు. మహిళా స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులను ఎటువంటి మోసాలకు గురి చేసిన డబ్బులు ఏ స్థాయిలోని ఉద్యోగులు వాడుకున్నా వెంటనే పోలీసు స్టేషన్‌లో కేసు పెట్టించాలని ఆదేశించారు. ఆర్థిక నేరాలకు పాల్పడే వారిని ఉపేక్షించవోద్దని హెచ్చరించారు.

మిర్చిబోర్డు సాధన లక్ష్యంగా పోరు

» రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్



మాట్లాడుతున్న రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్

కొణిజర్ల, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): మిర్చి రైతులు గిట్టుబాటు ధర కల్పన కోసం ఖమ్మంలో మిర్చి బోర్డు ఏర్పాటు చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్ పిలుపునిచ్చారు. శనివారం కొణిజర్ల దొండపాటి భవనంలో దడిపిన్ని వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన రైతు సంఘం కొణిజర్ల గ్రామశాఖ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం కొణిజర్ల గ్రామశాఖ అధ్యక్షుడిగా దడిపిన్ని వెంకటేశ్వర్లును, కార్యదర్శిగా తుప్పతి రామారావుతో పాటు 15 మంది కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం మండల కార్యదర్శి తండు సోమయ్య, నాయకులు స్వర్ణ రమేష్, కొమ్మినేని వెంకయ్య, తోటపల్లి సీతరాములు, అడపా వెంకటేశ్వర్లు, రాయల వెంకయ్య, సూరంపల్లి రమేష్, కృష్ణయ్య, గోపయ్య తదితరులు పాల్గొన్నారు.

గంటలో చికెన్, ఎగ్స్ ఖతం

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): గంటలో చికెన్ ఫ్రై, ఎగ్స్ ఖతమైన సంఘటన సత్తుపల్లి పట్టణంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. వెన్‌కాబ్‌కు చెందిన వెంకటేశ్వర హేచరీస్ కంపెనీ నిర్వాహకులు స్థానిక పోస్టాఫీస్ వద్ద చికెన్, ఎగ్ మేళా నిర్వహించారు. ఉచితంగా పంపిణీ కావడంతో మాంసంప్రియులు ఎగబడి మరి తిన్నారు. స్టాల్ ఏర్పాటు చేసిన గంటలోపే 2క్వింటాళ్ల చికెన్ ఫ్రై, కర్రీ, 2వేల ఎగ్స్‌ను ఎంచక్కా లాగించేశారు. బ్రాంచ్ ఇన్‌చార్జి రాము, మార్కెటింగ్ ఆఫీసర్ చెన్నారావులు మాట్లాడుతూ డబ్ల్యూహెచ్‌వో ప్రకారం 70డిగ్రీల సెంటిగ్రేడ్ కంటే ఎక్కువ ఉడికించాలని, వేడితో చికెన్, గుడ్లు ఉడికించడం వలన బర్డ్‌ఫ్లూ వైరస్ చనిపోతుందని, అధైర్య పడకుండా మాంసం తినవచ్చునని చెప్పారు.



చికెన్ కోసం ఎగబడుతున్న మాంసంప్రియులు

విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు

» ఎస్ఈ సురేందర్

చింతకాని, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): వేసవిలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా అన్ని చర్యలు చేపడుతున్నట్లు ఎస్ఈ సురేందర్ తెలిపారు. శనివారం ఆయన చింతకాని, నాగులవంచ సబ్ స్టేషన్‌లను సందర్శించారు. సందర్భంగా చింతకాని నుంచి నాగులవంచ సబ్ స్టేషన్‌లను అనుసంధానం చేసే 33 కేవీ విద్యుత్ లైన్‌ను ఆయన ప్రారంభించారు. తద్వారా నాగులవంచ, చింతకాని, పందిళ్లపల్లి సబ్ స్టేషన్‌లకు ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా ఏర్పడనుందని తెలిపారు. కార్యక్రమంలో డీఈ నంబూరి రామారావు, ఏడీఈ తిలక్, ఏఈ శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యం దిశగా ముందుకు సాగాలి

» ఇస్రో శాస్త్రవేత్త లక్ష్మీనారాయణ

మధిరటౌన్, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పరుచుకొని దాని సాధన దిశగా ముందుకు సాగాలని చంద్రయాన్-3లో భాగస్వాములైన ఇస్రో శాస్త్రవేత్త లక్ష్మీనారాయణ అన్నారు. మధిర హరిజవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు శాస్త్రవేత్తతో శనివారం ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థులలో స్ఫూర్తి నింపేందుకు పాఠశాల గణిత ఉపాధ్యాయులు ఊట్ల శంకర్‌రావు ఉదయం 8గంటల నుంచి 9గంటల వరకు ఆన్‌లైన్‌లో ఇస్రోలో శాస్త్రవేత్తగా పనిచేస్తున్న మధిరకు చెందిన బుర్రా లక్ష్మీనారాయణతో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయుడు శంకర్ సంధాన కర్తగా వ్యవహరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ విజయ శ్రీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతీ కేసుపై సమగ్ర దర్యాప్తు జరపాలి

» నేరస్థులకు శిక్షపడేలా అధికారులు కృషి చేయాలి
» నెలవారీ నేర సమీక్ష సమావేశంలో భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్



మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్‌రాజ్, హాజరైన డీఎస్పీలు, సీఐలు, ఎస్‌లు

కొత్తగూడెం, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): ప్రతి కేసుపై సమగ్ర దర్యాప్తును చేపట్టి నేరస్తులకు శిక్షపడేలా అధికారులు కృషి చేయాలని భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ అధికారులకు సూచించారు. శనివారం ఎస్పీ కార్యాలయంలో జిల్లా పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో జిల్లా పోలీసు అధికారులతో నెలవారీ నేర సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ప్రతీకేసులో లోతైన విచారణ జరిపి నేరస్తులకు శిక్షపడేలా బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. కేసుల విషయంలో జాప్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. పోలీసు అధికారులంతా బాధ్యతగా వ్యవహరించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై క్రమవిక్షణ చర్యలు తప్పవన్నారు. పెట్రోలింగ్, బ్లూకోల్ట్స్ వాహనాలతో అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడు రోడ్లపై తిరుగుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. అక్రమ ఇసుక రవాణాకు పాల్పడుతూ ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టే వ్యక్తులపై చట్ట ప్రకారం కఠినచర్యలు తీసుకోవాలని సూచించారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు, మట్కా, జూదం లాంటి అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా సైబర్‌నేరాల్లో నగదును కోల్పోయి బాధితులు వెంటనే స్పందించి ఫిర్యాదు చేసినప్పుడు తక్షణమే స్పందించి వారికి అండగా ఉండాలని, ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రమాదాలను గుర్తించి (బ్లాక్ స్పాట్స్) వాటి నివారణకైసంబంధిత అధికారులతో సమన్వయం పాటిస్తూ ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలను నడుపుతూ ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ రోడ్డు ప్రమాదాలకు కారణమయ్యే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లెందు డీఎస్పీలు రెహమాన్, సతీష్‌కుమార్, చంద్రభాను, డీసీఆర్‌బీ డీఎస్పీ మల్లయ్యస్వామి, జిల్లాలోని సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

నాలుగురోజుల వ్యవధిలో

అత్తా, కోడలి మృతి

పోలిశెట్టిగూడెంలో ఘటన



వెంకటమ్మ



కృష్ణవేణి

ఖమ్మంరూరల్, ఫిబ్రవరి22 (ఆంధ్రజ్యోతి): నాలుగు రోజుల వ్యవధిలో అత్తా, కొడలు మృతి చెందిన సంఘటన ఖమ్మం రూరల్ మండలం, పోలిశెట్టిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని మద్దివారిగూడెం గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చిక్కుల వెంకటమ్మ(60) గురువారం మృతి చెందింది. ఆమెకు ఇద్దరు కుమారులు, ఓ కుమార్తు ఉంది. సరిగ్గా ఆమె మృతిచెందిన నాలుగు రోజులకు పెద్ద కుమారుడి భార్య (కోడలు) చిక్కుల కృష్ణవేణి(40) శనివారం మృతి చెందినది. ఆమెకు కుమారుడు,కుమార్తె ఉన్నారు. వీరిద్దరు కూడా క్యాన్సర్ వ్యాధితో మృతిచెందారు. ఒకే ఇంట్లో అత్తా, కోడలు మృతిచెందడంతో ఆ కుటుంబం కన్నీటి పర్యంతమైంది.

జామాయిల్ తోట దగ్ధం

కారేపల్లి ఫిబ్రవవరి22(ఆంధ్రజ్యోతి):మండల పరిధిలోని చీమలపాడులో శనివారం సాయంత్రం ఈదురుగాలులకు హైటెన్షన్ తీగలు తెగి పడటంతో మూడు ఎకరాల జామయిల్ పంట బుగ్గిపాలైంది. విద్యుత్‌లైన్ జామయిల్ చెట్టుపై పడటంతో మూడు ఎకరాల జామయిల్‌తోట బూడిదగా మారిపోయి వేలాది రూపాయల నష్టం వాటిల్లింది. గ్రామానికి చెందిన షేరువెంకన్న, తాత కోటేశ్వరరావు ఈ ఘటనతో తీవ్రంగా నష్టపోయియరు. ప్రభుత్వం రైతులకు నష్టపరిహారం చెలించాలని పలువురు రైతులు కోరారు. నష్టం విలువ మూడు లక్షల వరకు ఉంటుందని రైతులు తెలిపారు.

డ్రైవర్ ఆత్మహత్య

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో ట్రాక్టర్ డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన సత్తుపల్లి మండలం గంగారం గ్రామ పంచాయితీ పరిధిలోని ప్రకాష్‌నగర్ కాలనీలో శనివారం చోటు చేసుకుంది. కాలనీకి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ తగరం కృష్ణ (32) కుటుంబ కలహాల నేపథ్యంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమ్మితం మార్చురీకి తరలించిన పోలీసులు కేసు నమోదు చేశారు.


చికిత్స పొందుతూ వ్యక్తి మృతి..

బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం గండుగులపల్లిలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో మండలంలోని చిన్నపాకలగూడెంకు చెందిన కేతేపల్లి జానకీరామ్ (35) తీవ్రంగా గాయపడ్డాడు. ఖమ్మంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య సుమలత,దివ్యాంగుడైన కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రముఖ వ్యాపారి

లక్ష్మీనర్సింహారావు కన్నుమూత

» బోనకల్ మండలంలో విరివిగా సేవా కార్యక్రమాలు
» సోదరుడి భార్య కమలేశ్వరి కూడా....



లక్ష్మీనర్సింహారావు, కమలేశ్వరి(ఫైల్)

బోనకల్,ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి):మండలంలోని రావినూతల గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారి, సాయిబాబా ట్రస్టు వైస్ చైర్మన్ చెన్నా లక్ష్మీనర్సింహారావు(78) అనారోగ్యంతో శుక్రవారం అర్ధరాత్రి కన్నుముశారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. గ్రామంలో ఫెర్టిలైజర్స్, విత్తనాల దుకాణంతో పాటు ఆయిల్ మిల్లును నడిపారు. పలు మండలాల నుంచి రైతులు రావినూతల గ్రామానికి వచ్చి విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, ఆయిల్‌ను కొనుగోలు చేసేవారు. ఇక్కడి వేరుశనగ నూనె కల్తీ లేకుండా స్వచ్ఛంగా ఉండేదని చెప్పుకునేవారు. వివాద రహితుడిగా, సౌమ్యుడిగా అందరితో సత్సంబందాలు కలిగి ఉండటంతో జిల్లాలో ఆయనకు మంచి వ్యాపారిగా పేరుంది. మండల వ్యాప్తంవగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన మృతదేహాన్ని మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, బాణోతు కొండ, వేమూరి ప్రసాద్, సీపీఎం నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, దొండపాటి నాగేశ్వరరావు, కిలారు సురేష్‌లు, ఆర్య వైశ్య సంఘ నాయకులు చేడ వెంకటేశ్వరరావు, తెల్లాకుల శ్రీనివాసరావు, రంగా జనార్ధన్‌రావు, కలవల బాబు, బచ్చు వెంకటేశ్వర్లు తదితరులు సందర్శించి సంతాపం తెలిపారు.

సోదరుడి భార్య మృతి

చెన్నా లక్ష్మీ నర్సింహారావు శుక్రవారం రాత్రి మృతి చెందగా, అయన సోదరుడి సతీమణి చెన్నా కమలేశ్వరి(58) శనివారం ఉదయం మృతి చెందారు. ఆమెకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. బావ మృతి చెందిన 12 గంటల వ్యవధిలోనే మరదలు మృతి చెందడంతో గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి. ఆమె నేత్రాలను ఖమ్మం నేత్రనిధికి దానం ఇచ్చారు.

సిగరెట్ కాటన్ల చోరీ: ముగ్గురు నిందితుల అరెస్ట్

పాల్వంచ,ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): సిగరెట్ కాటన్ల చోరీ కేసులోని ముగ్గురు ప్రధాన నిందితులను పాల్వంచ టౌన్ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. పాల్వంచ పట్టణం మార్కెట్‌లోని రామాలయ భజనమందిరం ప్రాంతంలో అశోక్, గణపతికుమార్, మనీష్ అనుమానాస్పదంగా తీరుగుతుండటంతో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ జరిపారు.చోరీకేసులో వారి ప్రమేయం ఉందని తేలడంతో వారిని అరెస్ట్ చేశారు.. పాల్వంచ డీఎస్పీ సతీష్‌కుమార్ పాల్వంచ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. పాల్వంచ మార్కెట్‌లోని ఓ హోల్‌సేల్ కిరాణా షాపులో రాజస్థాన్‌కు చెందిన అశోక్ పని చేస్తున్నాడు. ఇటీవల కాలంలో అతను చిన్నచిన్న దొంగతనాలకు అలవాటు పడ్డాడు. ఈ నేపథ్యంలో భారీగా దొంగతనం చేసి డబ్బులు సంపాదించాలనుకున్నాడు. ఈ క్రమంలోనే తన స్వరాష్ట్రంలోని తన స్నేహితులైన గణపతిరామ్, సునీల్, మనీష్‌లతో కలిసి పథకం రచించాడు. గతనెల 3న రాజస్థాన్ నుంచి తన స్నేహితులతో కలిసి వెర్టిగా వాహనంలో పాల్వంచకు వచ్చారు. అశోక్ నుంచి తీసుకున్న ముందస్తు సమాచారం మేరకు టీడీపీ కళ్యాణ మండపం సమీపంలోగల హోల్‌సేల్ సిగరెట్ దుకాణంలోకి చొరబడ్డారు. రూ.26 లక్షల విలువైన సిగరెట్ కాటన్లను దొంగిలించారు. పాల్వంచ సీఐ సతీష్ విచారణలో భాగంగా వారు రాజస్థాన్‌కు చెందినవారని నిర్ధారణకు వచ్చారు. ఈ సమాచారంతో శనివారం ఉదయం పట్టుబడిన ముగ్గురిని టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించగా దొంగతనాన్ని ఒప్పుకున్నారు. చోరీ చేసిన సిగరెట్ కాటన్లను పట్టబడిన నిందితుల్లో ఒకడైన హైదరాబాద్ బోయినపల్లికి చెందిన గణపతికుమార్‌కు విక్రయించినట్లుగా తెలిపారు. నిందితులనుంచి రూ.5లక్షల నగదు, 3 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వీరిని కోర్టులో హాజరుపరచనున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో పాల్వంచ సీఐ సతీష్, పాల్వంచ టౌన్ అడిషనల్ ఎస్ఐ రామవయ్య పాల్గొన్నారు.

యువకుడిపై దాడి ఘటనలో హిజ్రా అరెస్టు

ఖమ్మంరూరల్,ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): యువకుడిపై కత్తితో దాడి చేసిన హిజ్రాను శనివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటన ఏదులాపురం మున్సిపాలిటి పరిదిలోని పెద్దతండాలో శుక్రవారం రాత్రి జరిగిన విషయం తెలిసిందే.. ఏన్కూరు మండలం, కోనాయిగూడేనికి చెందిన మోహన్ కృష్ణ అనే యువకుడు పెద్దతండా సెంటర్‌లోని ఓ చికెన్ షాపులో పనిచేస్తుంటాడు.మచిలీపట్నానికి చెందిన సంగి వీరబాబు (హిజ్రా)తో కొంతకాలం ప్రేమ వ్యవహారం కొనసాగించాడు. ఆ హిజ్రాను పట్టించుకోకుండా వేరే యువతితో ప్రేమ వ్యవహారం నడిపిస్తున్నాడు.ఈ విషయం తెలుసుకున్న సదరు హిజ్రా శుక్రవారం రాత్రి చికెన్ షాపులో ఉన్న యువకుడిపై కత్తితో దాడి చేసింది. ప్రస్తుతం యువకుడి పరిస్థితి కొంతమెరుగ్గా ఉందని తెలిసింది. మోహన కృష్ణ తండ్రి బాదావత్ వీరన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



తెలంగాణ జనసమితి మండల అధ్యక్షుడిగా వాసం



నేలకొండపల్లి, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): తెలంగాణ జనసమితి నేలకొండపల్లి మండల అధ్యక్షుడిగా నేలకొండపల్లికి చెందిన వాసం రాజేంద్రప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం ఖమ్మంలో జరిగిన పార్టీ మండల కార్యకర్తల సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. జిల్లా ఇన్‌ఛార్జి గోపగాని శంకరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో అధ్యక్షుడిగా ఎన్నికైన రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ మండలంలో తెలంగాణా జన సమితి బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

ఘనంగా విన్‌ఫీల్డ్ పదో వార్షికోత్సవం



వేడుకలకు హాజరైన అతిథులు

ఖమ్మంఖానాపురంహవేలి, ఫిబ్రవరి22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని విన్‌ఫీల్డ్ పాఠశాల 10వ వార్షికోత్సవాన్ని శనివారం రాత్రి సీబీఎస్ఈ పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. కార్పొరేటర్లు మిక్కిలినేని మంజుల నరేంద్ర, చావా మాధురి నారాయణ, కూరాకుల వలరాజు, చిరుమామిళ్ల లక్ష్మీ నాగేశ్వరరావు, పాఠశాల డైరెక్టర్లు గద్దె పుల్లారావు, మన్నె కిషోర్‌కుమార్, పోలవరపు శ్రీకాంత్ జ్యోతి ప్రజ్వల నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులు మాట్లాడుతూ తల్లితండ్రుల నమ్మకాన్ని నిలబెడుతున్న పాఠశాల యాజమాన్యాన్ని అభినందించాలన్నారు. పాఠశాల డైరెక్టర్లు మాట్లాడుతూ మాప్రయాణంలో ప్రోత్సహిస్తున్న ప్రతీ తల్లితండ్రులకు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో మరింత అంకితభావంతో పని చేసి ఉత్తమ ఫలితాలు సాధిస్తామన్నారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పూర్వవిద్యార్థులను సన్మానించారు.

విద్యాలయాల్లో కవలల దినోత్సవం

న్యూవిజన్, హార్వెస్ట్‌లో వేడుకలు



న్యూవిజన్, హార్వెస్ట్‌లో విద్యాలయాల్లోని వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

ఖమ్మంఖానాపురంహవేలి, ఫిబ్రవరి22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని న్యూవిజన్ పాఠశాలలో శనివారం కవలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సృష్టిలో అద్భుత విషయాల్లో కవలలుగా జన్మించటమని, దగ్గర పోలికలతో విభిన్న మనస్తత్వాలతో కనిపించే వారిని చుస్తే సమాజంగా ఆశ్చర్యచకితులు అవుతామని పాఠశాల ప్రిన్సిపాల్ అబాద్ అలీ అన్నారు. పాఠవాలలో 16మంది కవలలతో కలిసి కేక్ కట్‌చేశారు. ఉపాధ్యాయులు కవలలకు శుభాకాంక్షలు తెలిపారు. ఒకే పోలికతో కనుల ముందు తిరుగుతున్న కవలలను చూస్తే కన్నుల పండగగా ఉంటుందని అన్నారు. హార్వెస్ట్ పాఠశాలలో జన విజ్ఞాన వేదిక బాధ్యులు కె సత్యప్రసాద్, పాఠశాల కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతీరెడ్డి వేడుకల్లో పాల్గొన్నారు. పాఠశాలలో మొత్తం 37 మంది కవలలు ఉన్నారని వారిలో ఎక్కువగా ఒకే విధమైన ముఖ కవలికలు కలిగిన అభిరుచులు, అలవాట్లు ఒకే రకంగా ఉంటాయని ప్రిన్సిపాల్ అన్నారు. ఆలోచనా విధానంలో కూడాబదగ్గర స్వభావాలు కలిగిఉన్నారని అన్నారు. కవలల సమక్షంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పెంచిపెట్టారు.

బకాయిలపై దృష్టి

- పంచాయతీలో పన్నుల వసూళ్ల జోరు
- 55శాతం వసూలు
- అభివృద్ధి చేయాలంటే పన్నులు చెల్లించాలి
- డీపీవో ఆశాలత



కారేపల్లి మండలంలో పన్నులు వసూలు చేస్తున్న దృశ్యం

ఖమ్మంకలెక్టరేట్,ఫిబ్రవరి22 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో పన్నుల వసూళ్ల ఇప్పుడిప్పుడే ఊపందుకుంటున్నాయి. ఇప్పటి వరకు పంచాయతీ, పరిషత్ ఎన్నికలు వస్తాయన్న ప్రచారంతో ఏర్పాట్లపై అధికారులు నిమగ్నం అయ్యారు. కానీ ఎన్నికలు తాత్కాలికంగా వాయిదా పడడంతో ఇక ఆదాయంపై దృష్టి సారించారు. ఇప్పటి వరకు నామమాత్రంగానైనా వసూలు కాని పన్నులపై అధికారయంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ ఏడాది ఇప్పటి వరకు 55శాతం వసూళ్లయ్యాయి. జిల్లా ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి సిబ్బందిపై లక్ష్యాలను నిర్దేశిస్తూ పర్యవేక్షిసున్నారు. ఇంటిపన్నులు, నీటిపన్నుల తోపాటు వృత్తిపన్నులు, ఇతర అనుమతుల ద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూర్చేందుకు కార్యాచరణ రూపొందించారు. ఈ నేపథ్యంలో మార్చి నాటికి దాదాపు 90శాతం వసూళ్ల అయ్యే ఆస్కారం ఉందని అధికారులు భావిస్తున్నారు.

రూ.9.65 కోట్లు వసూలు

జిల్లాలో 579పంచాయతీలలో(ఇటీవలె విలీనం అయిన పంచాయతీల 10 మినహాయించి) పన్నుల వసూళ్లకు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.. వీటిలో ఇప్పటి వరకు 55శాతం పన్నులు వసూలయ్యాయి. వాస్తవానికి రూ.17కోట్ల42లక్షల 54,213 పన్నులు వసూలు కావాల్సి ఉండగా ఇప్పటి వరకు రూ.9కోట్ల 65లక్షల 75441 వసూలయ్యాయి. పంచాయతీ పరిధిలో ఏ చిన్న అభివృద్ధి జరగాలన్నా నిధులు అవసరం ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ నెలా పంచాయతీల అభివృద్ధికోసం నిధులు విడుదల చేస్తున్నా అవి పంచాయతీల్లో ప్రభుత్వ ప్రాధాన్యత పనులైన పల్లె ప్రకృతి వనాలు, సెగ్రిగేషన్ షెడ్లు, వైకుంఠధామాల నిర్మాణం, రైతువేదికలు, పంచాయతీల్లో ట్రాక్టర్ల నిర్వహణ, వాటికి ప్రతినెలా చెల్లించే వాయిదాలకు ఈ మెత్తాన్ని చెల్లించాల్సి వస్తోంది. ఇక పంచాయతీల్లో వసూళ్లయ్యే పన్నులతో ఇతర అభివృద్ధి పనులకు ఆస్కారం ఉంది.

వసూళ్లు అంతంత మాత్రంగానే ..

ఈ నేపథ్యంలో ప్రతీ పంచాయతీల్లోనూ పన్నుల వసూళ్లకు ప్రాధాన్యతను ఇస్తున్నారు. పాలకవర్గాలు గడువుమీరి ఏడాది కావస్తుండడంతో సిబ్బంది లేక పంచాయతీ అధికారులు పన్నులపై దృష్టిసారించలేక పోయారు. అంతే కాదు పంచాయతీలకు ఎన్నికలు జరుగుతాయన్న నేపథ్యంలో అధికారయంత్రాంగం అంతా ఇప్పటి వరకు ఏర్పాట్లపై నిమగ్నం అయ్యారు. దీంతో పన్నుల వసూళ్ల అంతంత మాత్రంగానే ఉంది. ఈ ఏడాది 55 శాతం వసూలవ్వడంతో వీటిని 90శాతం కైనా వసూలయ్యేలా దృష్టిసారించాలంటూ క్షేత్రస్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. దీంతో పన్నుల వసూళ్లను ముమ్మరం చేస్తున్నారు.

ప్రత్యేక దృష్టిసారించాం

ఆశాలత, డీపీవో ఖమ్మం



ప్రతీపంచాయతీల్లోనూ నూటికి నూరుశాతం వసూలు చేయాలని నిర్ణయించాం. మార్చి నాటికి కనీసం 95 శాతమైన వసూలు చేయాలన్నది మాలక్ష్యం. ఈ దిశగా పని చేస్తున్నాం. గ్రామాల్లో ప్రభుత్వం మంజూరి చేస్తున్న నిధులతో సౌకర్యాలను కల్పిస్తున్నాం. ప్రజలు స్వచ్ఛందంగా పన్నులు చెల్లిస్తే తమ ప్రాంతాల అభివృద్ధికి ఆస్కారం ఉంటుంది.

ఘనంగా న్యూరిడ్జ్ వార్షికోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డీఈవో

ఖమ్మంఖానాపురంహవేలి,ఫిబ్రవరి22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని న్యూరిడ్జ్ పాఠశాల 10వ వార్షికోత్సవాన్ని శనివారం నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మేయర్ నీరజ, డీఈవో సోమశేఖరశర్మ, 4,5 డివిజన్ కార్పొరేటర్లు దండా జ్యోతి రెడ్డి, పల్లెబోయిన భారతీచంద్రయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా మేయర్ నీరజ మాట్లాడుతూ విద్యార్థుల పట్ల తల్లితండ్రులు ఇంటి వద్ద శ్రద్ధ కనబరిస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలోపాఠశాల కరస్పాండెంట్ కావూరి పద్మావతి, డైరెక్టర్ కావూరి రాజశేఖర్ మాట్లాడుతూ అందుబాటులో ఉండే ఫీజులతో అత్యుత్తమ బోధనను అందిస్తున్నామన్నారు.

క్యాంపస్ డ్రైవ్‌లో ఎస్‌బీఐటీ విద్యార్థుల ఎంపిక

ఖమ్మంఖానాపురంహవేలి, ఫిబ్రవరి22 (ఆంధ్రజ్యోతి):నగరంలోని ఎస్‌బీఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం కోజెంట్ ఈ సర్వీస్ నిర్వహించిన ఆఫ్ కాంపస్ డ్రైవ్‌లో 49 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. బ్యాంకర్ పోస్టులకు అత్యధికంగా విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. కళాశాల కరస్పాండెంట్ సెక్రటరీ జీ ధాత్రీ, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, డైరెక్టర్లు గుండాల ప్రవీణ్, శ్రీనివాస్‌రావు శివప్రసాద్ వారిని అభినందించారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

తిరుమలాయపాలెం, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ ప్రాంతాల్లో అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఎస్ఐ కూసుపుడి జగదీష్ ఆధ్వర్యంలో శనివారం పట్టుకున్నారు. మండలంలోని ఆకేరునుంచి వెదుళ్ల చెరువుమీదుగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకుని వారిపై కేసు నమోదుచేసి ట్రాక్టర్లను పోలీసు స్టేషన్‌కు తరలించారు.

న్యాయవాదులు వృత్తి నైపుణ్యం పెంచుకోవాలి

- జిల్లా మొదటి అదనపు న్యాయాధికారి ఉమాదేవి



శిక్షణ తరగతుల కార్యక్రమంలో మాట్లాడుతున్న న్యాయాధికారి ఉమాదేవి

ఖమ్మంలీగల్, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): ఐఏఎల్ (ఇండియన్‌అసోసియేషన్ ఆఫ్ లాయర్స్) ఆధ్వర్యంలో శనివారం ఉదయం జరిగిన ఐఏఎల్ స్టడీ శిక్షణ తరగతులకు ముఖ్య అతిథిగా ఖమ్మం మొదటి అదనపు జిల్లా న్యాయాధికారి కె.ఉమాదేవి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ న్యాయవాదులు ఎల్లప్పుడు వృత్తిపర నైపుణ్యాన్ని పెంపోందించుకోవాలని, పెరుగుతున్న సైన్స్‌టెక్నాలజీని అందిపుచ్చుకొని ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీని ఉపయోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. న్యాయవాదులు నిత్యం విద్యార్థులేనని, కొత్త చట్టాలకు అనుగుణంగా పనిచేయాల్సిన అవసం ఉందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీ మరియు క్రాస్ ఎగ్జామినేషన్ మీద శిక్షణ తరగతులను వరంగల్ సీనియర్ న్యాయవాది గంటా విద్యాసాగర్‌రెడ్డి, హైకోర్టు న్యాయవాది టెక్కం భగత్‌సేన విశ్లేషణ ద్వారా బోధించారు. ఈ కార్యక్రమంలో న్యాయాధికారులు వెంపటి అపర్ణ, ఎం.అర్చనకుమారి, డి.రామ్‌ప్రసాద్, వి.శీనయ్య, ఎం.కల్పన, బిక్కం రజని, న్యాయవాదులు పోట్ల మాధవరావు, పెమ్మసాని పట్టాభి, దుస్సా జనార్థన్, పి.అమర్‌చంద్, ఐఏఎల్ అధ్యక్షుడు షేక్ లతీఫ్, కార్యదర్శి ఓరుగంటి శేషగిరిరావు, షేక్.నస్రీన్, శివకుమారి, ఐఏఎల్ సభులు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

పూల రవీందర్‌ను గెలిపించాలి

ఖమ్మంచర్చికాంపౌండ్, ఫిబ్రవరి22 (ఆంధ్రజ్యోతి):ఈనెల27నజరిగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ అభ్యర్థి పూల రవీందర్‌ను గెలిపించాలని బీసీసంక్షేమసంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. శనివారం ఖమ్మం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికలలో బీసీలంతా ఏకమై పూలరవీందర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటువేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈనెల 17 నుంచి 26 వరకు ఎన్నికలు జరిగే జిల్లాల్లో ఓటు మనదే ..సీటు మనదే...మేము ఎంతో మాకుఅంత అనే నినాదంతో ప్రచార యాత్ర నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో బీసీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుంకర శ్రీనివాస్, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం డాక్టర్ కేవీ కృష్ణారావు, పెల్లూరి విజయ్‌కుమార్, పసుపులేటి నాసరయ్య, మోతుకూరి వెంకటేశ్వరాచారి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

తిరుమలాయపాలెం, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): మండలంలోని మహ్మదాపురానికి చెందిన జనగం రాందాస్ శుక్రవారం రోడ్డుప్రమాదంలో మృతి చెందగా వారి కుటుంబసభ్యులకు నాయీబ్రాహ్మణ సేవా సంఘం ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందించారు. రాందాస్ ఖమ్మం నుంచి మహ్మదాపురం ద్విచక్రవాహనం వెళుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతిచెందాడు ఈమేరకు సంఘం ఐక్యవేదిక అధ్యక్షుడు యలమందల జగదీష్, కార్యదర్శి గుండ్లపల్లి శ్రీనివాస్, నంద్యాల నరసింహారావు, సురభి సైదులు, రామారావు నగదు అందించారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

ఖమ్మంఖానాపురంహవేలి ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మామిళ్ళగుడెం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు శనివారం సైబర్ క్రైం డీఎస్పీ ఫణిందర్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కిప్టో, బిట్‌కాయిన్‌మోసాలు, పిరమిడ్ తదిత మోసాలపై అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. అపరచితుల నుంచి ఫోన్‌కాల్స్ వచ్చినా అప్రమత్తంగా ఉండాలని వెంటనే 1930కి ఫోన్ చేయాలని అన్నారు.

నేడు కేవీపీఎస్ డివిజన్ మహాసభ

ఖమ్మంరూరల్, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): ఆదివారం పాలేరు డివిజన్ కేవీపీఎస్ మహాసభను నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు పొన్నేకంటి సంగయ్య పిలుపు నిచ్చారు. ఏదులాపురం మున్సిపాలిటి పరిధిలోని గుడిమళ్లలో శనివారం మహాసభను విజయవంతం చేయాలని వారు ప్రచారం నిర్వహించారు.

నేడు 'ఉదయ సాహితి' సమావేశం

ఖమ్మంఖానాపురంహవేలి, ఫిబ్రవరి22 (ఆంధ్రజ్యోతి): ఉదయసాహితి సాహిత్య వికాస వేదిక రాష్ట్ర సర్వ సభ్య సమావేశం ఆదివారం నగరంలోని బోడేపుడి విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వురిమళ్ల సునంద తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నేటికవిత సమూహ సభ్యులు హాజరు కానున్నారని, అర్హులైన కవులకు కవితా భూషణ, కవితా విభూషణ, సహస్ర కవితా స్ఫూర్తి అవార్డులతో సత్కరించనున్నట్లు తెలిపారు.

డీసీసీలో అబుల్ కలాం వర్ధంతి



నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఖమ్మంసంక్షేమవిభాగం, ఫిబ్రవరి22 (ఆంధ్రజ్యోతి): మన విద్యార్థులు ప్రపంచ వ్యాప్తంగా మంచి ప్రతిభ కనబర్చటం వెనుక దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఎంతో కృషి చేశారని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆజాద్ 67వ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి డీసీసీ అధ్యక్షుడు పూలమాల వేసి నివాళులు అర్పించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రిగా 11ఏళ్లు పని చేశారని గుర్తు చేశారు. జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు గౌస్, కార్పొరేటర్ పల్లెబోయిన చంద్రభారతి, నాయకులు నరాల నరేశ్ పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి

- పోలీస్ కమిషనర్ సునీల్‌దత్
- లింగాల క్రాస్‌రోడ్‌లో సరిహద్దు చెక్‌పోస్ట్ తనిఖీ



ఎస్ఐతో మాట్లాడుతున్న సీపీ

కామేపల్లి,ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): అక్రమ ఇసుక రవాణా నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశించారు. శనివారం మండల పరిధిలోని లింగాల క్రాస్ రోడ్‌లో ఏర్పాటు చేసిన సరిహద్దు చెక్‌పోస్ట్‌ను తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక అక్రమ రవాణాను పూర్తిగా నిరోధించేందుకు చెక్‌పోస్ట్ ద్వారా నిరంతర పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. వాగులు, నది పరివాహక ఇసుక తవ్వకాల ప్రాంతాలను గుర్తించి నిఘా పెంచాలని సూచించారు. ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలతోపాటు జరిమానాలు విధించడం, వాహనాలను జప్తు చేయడం జరగుతుందని సూచించారు. ఇసుక నిల్వ ఉంచితే జరిమానాలు తప్పవని అన్నారు. ఈ తనిఖీలో కామేపల్లి ఎస్ఐ బి. సాయికుమార్ పాల్గొన్నారు.

విద్యార్థుల్లో మానసిక ఒత్తిడి

పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేష్

ఖమ్మంసంక్షేమవిభాగం,ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు కార్పొరేట్ కాలేజీల్లో విద్యాభ్యాసం చేసే విద్యార్థులు మానసిక వత్తిడితో మరణిస్తున్నా రాష్ట్రప్రభుత్వం పట్టించుకోవటం లేదని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేష్ ఆరోపించారు. ఈమేరకు శనివారం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ కాలేజీ ఎదుట నాయకులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. రాష్ట్రంలో ఇటీవల అనేకమంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని, వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వినయ్, శ్రీకాంత్, సందీప్, యశ్వంత్, సాదిక్, వెంకటేష్, అన్వేష్; ప్రసాద్, స్టాలిన్, లక్ష్మణ్, అశోక్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడికి పరామర్శ

నేలకొండపల్లి,ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతూ కోమాలో ఉన్న మూటాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు ఏలూరి సురేష్ కుటుంబ సభ్యులను వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు శనివారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. సురేష్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్, సీడీసీ డైరెక్టర్ గుడిమళ్ళ మధు, సొసైటీ డైరెక్టర్ బొల్లినేని వెంకటేశ్వర్లు, నాయకులు బాగం హనుమంతరావు, నంబూరి ప్రసాద్, శ్యామలేటి కిరణ్, నామవరపు కిరణ్, ఏలూరి శ్రీనివాసరావు పరామర్శించిన వారిలో ఉన్నారు.

చెరువుల ఆక్రమణలను తొలిగించాలి

ఖమ్మంచర్చికాంపౌండ్, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని చెరువులను ఆక్రమణలను తక్షణమే తొలిగించి, ఎఫ్‌డీఎల్, బఫర్ జోన్లను నిర్ధారించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు యర్రా శ్రీకాంత్, డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్ డిమాండ్ చేశారు. ఈమేరకు ఖమ్మం ఆర్డీవో నరసింహారావుకు వినతిపత్రం అందించారు. ఈకార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎంఎ జబ్బార్, ఎస్‌కే మీరాసాహెబ్,డి. తిరుపతిరావు, భూక్యా శ్రీను, నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

దళితవాడలకు నిధులు కేటాయించాలి

తిరుమలాయపాలెం, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): దళితవాడల అభివృద్ధికి నిధులు కేటాయించి ఖర్చుచేయాలని కేవీపీఎస్ జిల్లానాయకులు కొమ్ము శ్రీను తెలిపారు. ఈనెల 23న కేవీపీఎస్ డివిజన్‌స్థాయి సమావేశం జయప్రతం కోరుతూ శనివారం మండలంలోని వెదుళ్లచెరువు, మేడిదపల్లి,సుబ్లేడు,మహ్మదాపురం,దమ్మాయిగూడెం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎస్.రాము, మహేందర్, ఉపేందర్, లక్ష్మీనారాయణ, రామారావు,ప్రసాద్ పాల్గొన్నారు.

ఫైనల్‌కు చేరిన ఖమ్మం, నేలకొండపల్లి

ఖమ్మంస్పోర్ట్స్,ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో జరుగుతున్న రాజీవ్ ట్రోఫీ ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ఫైనల్స్ దశకు చేరుకున్నాయి. ఖమ్మంఅర్బన్, నేలకొండపల్లి జట్లు ఆదివారం తుది పోటీని నిర్వహించనున్నారు.

అఖిల భారత బ్యాడ్మింటన్ పోటీలకు హెడ్‌కానిస్టేబుల్ కృష్ణసూరి

మార్చిలో కొచ్చిలో నిర్వహించే పోటీలకు హాజరు

ఖమ్మంక్రైం, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖ 2025 అఖిల భారత పోలీసు బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌కు హెడ్‌కానిస్టేబుల్ టి.కృష్ణసూరి అర్హత సాధించారు. సీపీ సునీల్‌దత్‌ను తన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలవడంతో సీపీ ని కృష్ణసూరిని అభినందించారు. హైదరాబాదులోని పోలీసు అకాడమిలో ఫిబ్రవరి 20, 21 తేదీల్లో నిర్వహించిన సెలక్షన్ టోర్నమెంట్‌లో కృష్ణసూరి మొదటస్థానంలో నిలిచారు. మార్చిలో కేరళలో కొచ్చిలో నిర్వహించే ఆలిండియా పోలీసు బ్యాడ్మింటన్ షిప్పులో ఆయన పాల్గొనబోతున్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

ఖమ్మంరూరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఏదులాపురం మున్సిపాలిటి పరిధిలోని ఏదులాపురం క్రాస్‌రోడ్డు వద్ద ఈనెల 18వ తేదీన గుర్తు తెలియని వాహనం ఢీ కొని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. అతడి వయసు సుమారు 35 ఏళ్ల ఉంటాయి. మృతదేహన్ని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో ఆరోజు నుంచి భద్రపరిచారు. నాలుగు రోజులు గడుస్తున్నా మృతుడి ఆచూకీ లభ్యం కాలేదు. మృదేహం పాడైపోవడం, అతని ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులు అన్నం శ్రీనివాస్‌రావుకు సమాచారం అందించారు. ఆయన బృందం చేత శనివారం అంత్యక్రియలు నిర్వహించారు.

ముంచుకొస్తున్న తాగునీటి ఎద్దడి

» కాలం చెల్లిన మంచినీటి పథకం
» రెండు రోజులకు ఒక సారి నీటి సరఫరా
» పట్టించుకోని అధికారులు

కల్లూరు, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): కల్లూరు పట్టణంలో రక్షిత మంచినీటి పథకానికి కాలం చెల్లడంతో ఫిల్టర్‌బెడ్స్ సక్రమంగా పనిచేయక పోవటం, శుద్ధినీటిని మంచినీటి పథకాలకు తోడేసే మోటార్ల సామర్థ్యం సరిపడని పరిస్థితి. దీంతో గ్రామ పంచాయతీ అధికారులు స్థానిక ప్రజానీకానికి సక్రమంగా తాగునీరు అందించని పరిస్థితి నెలకొన్నది. 30 సంవత్సరాల క్రితం నాటి జనాభాను దృష్టిలో ఉంచుకొని ఖాన్‌ఖాన్‌పేటలో అప్పటి ప్రభుత్వం (3.50 లక్షల నీటి సామర్థ్యం గల) ఈ మంచినీటి పథకాన్ని నిర్మించారు. కాల క్రమంలో పెరుగుతున్న జనాభాకు ఈ పథకం ద్వారా సరిపడా తాగునీరు అందించని పరిస్థితి. దీంతో గ్రామ పంచాయతీ వారు కల్లూరు పట్టణంలో గల ప్రధాన వీధుల్లో రోజు వారిగా తాగునీరు అందించలేక రెండు రోజులకు ఒకసారి మంచినీటి సరఫరా చేస్తున్నారు. మరో వైపున ఈ పథకానికి సంబంధించిన ఫిల్టర్ బెడ్స్ కూడా ఇప్పటి జనాభా సామార్థ్యానికి సరిపడక మంచినీటిని శుద్ధి చేసి అందించలేకపోతున్నాయి. దీంతో కల్లూరు పట్టణం జనాభా పెరిగినందున స్థానికంగా ప్రధాన విధుల్లో శుద్ధి చేసిన తాగునీరు సరఫరా చేయడం పం చాయతీ వారికి కష్టసాధ్యంగా మారింది.

ఇప్పటికే కల్లూరులో 16 వేలకు పైగా జనాభా ఈ పథకంపై ఆధార పడ్డారు. గ్రామ పం చాయతీ శివారున ఖాన్‌ఖాన్‌పేటలో గల మం చినీటి పథకం నుంచి ప్రతి రోజు 13.29 లక్షల లీటర్ల మంచినీటిని సరఫరా జరుగుతుంది. కాని ఫిల్టర్‌బెడ్స్ పాతవి కావడంతో వాటిలో ఇసుక పేరుకొని అపరిశుభ్రంగా మారాయి. వాటిలో మురికిగా మారిన ఇసుకను తొలిగించి శుభ్రం చేయాలంటే పంచాయతీ అధికారులకు ఆర్థిక భారంగా మారింది. నిధులు లేనందున ఫిల్టర్‌బెడ్స్ మరమ్మతులు చేయడం లేదని తెలిసింది. దీంతో వేసవి సీజన్‌లో తాగునీటి ఎద్దడి దాపురించనున్నది. రెవెన్యూ డివిజన్ కేంద్రంగా, ఎదిగిన కల్లూరు మునిసిపాలిటీ మారనున్న దశలో కూడా తాగునీటి సరఫరాలో సమస్యను అధికమిచేలా అధికార యంత్రాంగం తగిన కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగాల్సిన అవసరం ఉంది.



కల్లూరులోని రక్షిత మంచినీటి పథకం
(ఇన్‌సెట్‌లో అరకొరగా వస్తున్న తాగునీరు)

సక్రమంగా పనిచేయని ఫిల్టర్‌బెడ్స్

ప్రస్తుత తాగునీటి పథకానికి ఫిల్టర్‌బెడ్స్ ఆధునికీకరణతో పాటుగా 15 హెచ్‌పీ సామర్థ్యం గల రెండు విద్యుత్ మోటార్లను వాటికి అనుసంధానం చేస్తే పంపింగ్ సిస్టం నుంచి శుద్ధి చేసిన నీరు మంచినీటి పథకానికి (తోడేసేందుకు) సులువుగా అందుతుంది. మరో వైపున కల్లూరులో గల పాత మంచినీటి పథకాల ద్వారా అందినున్న తాగునీరు, భగీరథ పైపులకు అనుసంధానం చేసి మంచినీరు సరఫరా చేయడంతో పైపులైన్లలో ఆ నీరు కలుషితం అవుతున్నాయి. దీంతో ఆ నీటిని తాగేందుకు ప్రజలు ఎక్కువ శాతం ఆశక్తి చూపుటం లేదు. బహిరంగ మార్కెట్లో వాటర్ ప్లాంట్లలో తయారైన నీటిని కొనుగోలు చేసి స్థానిక ప్రజలు తాగుతున్నారు. ఈ వేసవి సీజన్‌లో తాగునీటి ఎద్దడిని నివారించేలా మంచినీటి పథకానికి అవసరమైన నిధులు అధికారులకు, మం త్రులకు కేటాయించాల్సి ఉంది. ఈ వేసివి సీజ న్‌లో కార్యాచరణ ప్రణాళిక రూపొందించి తమ పై అధికారులకు పంపడం జరగుతుందని స్థానిక పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు తెలిపారు.

సాగు నీటిని పొదుపుగా వినియోగించుకోవాలి

» ఏడీఏ స్వర్ణవిజయచంద్ర



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న అధికారులు

చింతకాని, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): సాగర్ ఆయకట్టు రైతులు సాగు నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని మధిర వ్యవసాయ సహాయ సంచాలకులు స్వర్ణ విజయచంద్ర సూచించారు. శనివారం మండల పరిధిలోని నాగిలిగొండ, పొద్దుటూరు, నేరడ, తిమ్మినేనిపాలెం గ్రామాల్లోని సాగర్ ఆయకట్టు భూములను ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. నీటిని వృథా చేయకుండా ఆయకట్టు చివరి వరకు నీరు వెళ్లేందుకు రైతులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏవో సోములపల్లి మానస, ఇరిగేషన్ ఏఈ సందీప్, ఏఈవోలు రాము, తేజ పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

» ట్రైనీ ఐపీఎస్ రుత్విక్ సాయి



కంటి పరీక్షలు చేయించుకుంటున్న ట్రైనీ ఐపీఎస్

మధిరటౌన్, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): పోలీసులు, వారి కుటుంబ సభ్యులు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకుని కంటి పరీక్షలు చేయించుకోవాలని మధిర టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో, ట్రైనీ ఐపీఎస్ కొట్టె రుత్విక్ సాయి కోరారు. శనివారం మధిర సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో ఖమ్మం శరత్ మాక్స్‌విజన్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో పోలీసుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీఐ డి. మధు, రూరల్ ఎస్ఐ లక్ష్మీభార్గవి, బోనకల్ ఎస్ఐ మధుబాబు పాల్గొన్నారు.

నేడు టీజీఆర్ఎస్‌లో ఐదో తరగతి ప్రవేశ పరీక్ష

వైరా, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): వైరాలోని మధిర రోడ్డులో బస్టాండ్‌కు సమీపంలో ఉన్న తెలంగాణ బాలికల గురుకుల విద్యాలయం(టీజీఆర్ఎస్)లో ఆదివారం ఐదోతరగతి కామన్ ప్రవేశ పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేశామని ప్రిన్సిపల్, చీఫ్ సూపరింటెండెంట్ బత్తుల రమ తెలిపారు. బస్టాండ్‌కు సమీపంలోనే ఉన్న ఈ గురుకుల పాఠశాలలో 192మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష కేంద్రానికి ఉదయం పదిగంటలకు చేరుకోవాలని, 11గంటలకు పరీక్ష ప్రారంభమవుతుందని చెప్పారు. బ్లూ, బ్లాక్ బాల్‌పాయింట్ పెన్నులు, హాల్‌టిక్కెట్స్, పరీక్ష ప్యాడ్‌లను వెంట తెచ్చుకోవాలని, నిర్ణీత సమయానికి పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

మౌలానా అబ్దుల్‌కలాం ఆజాద్ ఆశయాలు సాధించాలి

» ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్



ఆజాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు, భారత ప్రభుత్వ తొలి విద్యాశాఖ మంత్రి, భారతరత్న మౌలానా అబ్దుల్‌కలాం ఆజాద్ 67వ వర్ధంతి వేడుకలను శనివారం వైరా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ పాల్గొని మౌలానా అబ్దుల్‌కలాం ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, మునిసిపల్ మాజీ చైర్మన్ సూతకాని జైపాల్, కట్ల రంగారావు, సూరంపల్లి రామారావు, ఏదునూరి సీతరాములు, పమ్మి అశోక్, బోళ్ల గంగారావు, పాలేటి నర్సింహారావు, గొల్లపూడి కృష్ణారావు, టీడీకే.రత్నం, పల్లపు కొండలు, పణితి శ్రీను, చప్పిడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బెంచీల వితరణ

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌కు చెందిన నోస్ ల్యాబ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపనీ దాతృత్వం చాటుకుంది. స్థానిక ఎన్టీఆర్ నగర్‌లోని ప్రాథమిక పాఠశాలకు సుమారు రూ.4లక్షల విలువైన ఫర్నీచర్‌ను శనివారం వితరణగా అందజేసినట్లు హెచ్‌ఎం సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా నోస్ ల్యాబ్ నిర్వాహకులకు ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆట వస్తువుల పంపిణీ

వైరా, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): నేటి బాలలే రేపటి పౌరులని లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ పేర్కొన్నారు. రేపాల మదన్‌మోహన్ సహకారంతో వైరాలోని సుందరయ్యనగర్‌లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు ఆటవస్తువులను శనివారం పంపిణీ చేశారు. లయన్స్, గ్రేట్ విజన్‌క్లబ్‌ల అధ్యక్షులు చింతలపూడి వెంకటేశ్వరరావు, తోటకూర శ్రీకాంత్, నిర్వాహకులు లగడపాటి ప్రభాకర్‌రావు, మాదినేని సునీత, చింతోజు నాగేశ్వరరావు, వై.రాజారావు, వై.బుచ్చిరామారావు, రంగా సత్యనారాయణ, పులి కృష్ణార్జున్, అంగన్‌వాడీ టీచర్ మట్టూరి శ్రీదేవి పాల్గొన్నారు.

ఆలయాల్లో పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అత్యంత వైభవంగా ప్రతిష్ఠ జరుపుకున్న స్థానిక అయ్యగారిపేటలో శ్రీ సీతారామచంద్రస్వామి రామాలయంలో శనివారం 16రోజుల పండుగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు నైవేద్యం సమర్పించుకున్నారు. అన్నదానం ఏర్పాటు చేశారు.

తల్లాడలో...

తల్లాడ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం పినపాక గ్రామంలో శనివారం ఘనంగా సామూహిక కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. సోమలింగేశ్వరస్వామి ప్రతిష్ఠ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు గోవిందుశర్మ, మురళీధర్‌శర్మ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

మాజీ ఎంపీపీ హరిదాసు సతీమణి మృతి



నాగమణి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

ముదిగొండ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ మాజీ ఎంపీపీ సామినేని హరిప్రసాద్ సతీమణి సామినేని నాగమణి(62) శనివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. హరిప్రసాద్‌ను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఫోన్లో పరామర్శించి సంతాపం, సానుభూతి తెలిపారు. మృతికిగల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే నాగమణి భౌతికకాయానికి ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, మాజీ డీసీసీబీ, జడ్పీచైర్మన్లు కూరాకుల నాగభూషణం, లింగాల కమల్‌రాజ్, సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర నాయకుడు బాగం హేమంతరావు, బండి రమేష్, బట్టు పురుషోత్తం, కొమ్మినేని రమేష్, వాచేపల్లి లక్ష్మారెడ్డి, పోట్ల వెంకటప్రసాద్, మీగడ శ్రీను నివాళులర్పించారు. అనంతరం నాగమణి నేత్రాలను ఖమ్మం నేత్రనిధికి దానం చేసినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

ఆరోగ్య సంరక్షణ ముఖ్యం : ఎమ్మెల్యే

సత్తుపల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): వృత్తిలో రాణించడంతో పాటు ఫొటో, వీడియోగ్రాఫర్లకు ఆరోగ్య సంరక్షణ కూడా ముఖ్యమని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. శనివారం స్థానిక లక్ష్మీప్రసన్న ఫంక్షన్‌హాల్‌లో హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రి, వాసన్ ఐ కేర్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత మెగా హెల్త్‌క్యాంప్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సుమారు 200మంది ఫొటోగ్రఫీ కుటుంబ సభ్యులు పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో పెనం కనకారావు, మారగాని వెంకట్, తిరుపతిరావు, నాగరాజు, తిరుమలరావు, సతీష్, హరినాథ్, సుమాంజలి రాము, హరీష్, పాషా, మురళీ, మూర్తి, రాంబాబు, ప్రభాస్, నరేష్, పరిమి వెంకటేశ్వరరావు, వేముల నరసింహారావు, బాబీ, భాస్కర్‌రెడ్డి, యశ్వంత్, నరసింహారావు, రాఘవాచార్యులు, కోటేశ్వరరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాగమయి

సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాలు



సేవాలాల్ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీ 20వ వార్డులోని లంబాడీ తండాలో శనివారం సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలు నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ ముఖ్యఅతిథులుగా హాజరై బోగ్‌బండార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. లంబాడీ తండాలో సంత్ సేవాలాల్ గుడి నిర్మాణానికి సహకరించాలని కోరుతూ ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఏదునూరి సీతరాములు, మునిసిపల్ మాజీ చైర్మన్ సూతకాని జైపాల్, కట్ల రంగారావు, గుగులోతు లక్ష్మీబాయి, రాము, బోళ్ల గంగారావు, పాలేటి నర్సింహారావు, పమ్మి అశోక్, ధార్న రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఈ శ్రీనివాస్

బోనకల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): వేసవి కాలంలో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తుగా గ్రామాలలో ప్రణాళికలను రూపొందించాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ శ్రీనివాస్ సూచించారు. స్థానిక ఐకేపీ కార్యాలయ భవనంలో శనివారం ఈజీఎస్, పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేసేందుకు గానూ క్లోరినేషన్ చేపట్టాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీడీవో ఆర్. రమాదేవి, ఎంపీవో శాస్త్రి, ఏపీవో కృష్ణ కుమారి పాల్గొన్నారు.

చంద్రబాబును విమర్శించే స్థాయి జగదీష్‌రెడ్డికి లేదు

» టీడీపీ పట్టణ అధ్యక్షుడు మల్లాది హనుమంతరావు



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

మధిరటౌన్, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): చంద్రబాబును విమర్శించే స్థాయి మాజీ మంత్రి జగదీష్‌రెడ్డికి లేదని టీడీపీ పట్టణ అధ్యక్షుడు మల్లాది హనుమంతరావు అన్నారు. శనివారం మధిర టీడీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీకి తెలంగాణలో లక్షా ఎనభై వేల మంది క్రియాశీలక సభ్యులు ఉన్నారని, రానున్న ఎన్నికల్లో టీడీపీ ఈ రాష్ట్రంలో క్రియాశీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షులు మార్నీడి పుల్లారావు, నాయకులు వేమూరి సునీల్, చెరుకూరి కృష్ణారావు, చేకూరి శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ చట్టాలకు తూట్లు పొడుస్తున్న అధికారులు

» ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు ధర్మసోత్ దశరథ్‌నాయక్

పెనుబల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ మండలమైన పెనుబల్లిలో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించి ఏజన్సీ చట్టాలకు తూట్లు పొడుస్తున్నారని ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు ధర్మసోత్ దశరథ్‌నాయక్ ఆరోపించారు. శనివారం రామచంద్రరావుబంజర్‌లో సంఘం ముఖ్యకార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఏజన్సీలో ఇష్టానుసారంగా భవనాలు కడుపుతూ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఏజన్సీ ప్రాంతంలో యువజనేతరులు సిండికేట్లుగా ఏర్పడి ఇష్టారాజ్యంగా వ్యవహరించి అనుమతులు లేకుండా పెర్టిలైజర్ షాపులు, ఇతర షాపులను నడుపుతున్నారని ఆయన ఆరోపించారు. సమావేశంలో పెనుబల్లి, తల్లాడ మండల అధ్యక్షులు గుగులోతు పందునాయక్, నందు, కృష్ణ, నాగరాజు, భద్రు, గణేష్, ఐశ్వర్య, బాబు, రాము పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దశరథ్‌నాయక్

ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్ల పరిశీలన

మధిరటౌన్, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): ఖమ్మం, నల్లగొండ, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి జరగనున్న ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు మండల ఎన్నికల అధికారి, మధిర తహసీల్దార్ రాంబాబు తెలిపారు. శనివారం పోలింగ్ కేంద్రం అయిన మధిర టీవీఎం హైస్కూల్‌లో ఏర్పాట్లను ఎస్‌హెచ్‌వో, ట్రైనీ ఐపీఎస్ కొట్టె రిత్విక్ సాయి, మధిర సీఐ డి.మధుతో కలిసి పరిశీలించారు. ఈ నెల 27న గురువారం జరగనున్న ఎన్నికల్లో మధిర మండలంలో పురుషులు 121 మంది, మహిళలు 82 మందితో కలిపి మొత్తం 203 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

మధిరటౌన్, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): మధిర ఎస్సీ కాలనీ వాసులు లో వోల్టేజి సతమవుతుండటంతో విద్యుత్ అధికారులు ఏర్పాటు చేసిన నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎన్పీడీసీఎల్ వైరా డివిజనల్ ఇంజనీర్ బండి శ్రీనివాసరావు శనివారం ప్రారంభించారు. 160కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌తో ఇబ్బందులు తొలుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ అనురాధ, ఏఈ అనిల్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

హమాలీ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసరావు



తల్లాడ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రగతిశీల హమాలీ అండ్ మిల్లు వర్కర్స్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తల్లాడ మండలం మల్లవరం గ్రామానికి చెందిన డి.శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఖమ్మంలో జరిగిన రాష్ట్ర మహాసభలో శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తల్లాడకు చెందిన పఠాన్ నాగూల్‌మీరా, దారావత్ రమణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు.

విరాళం అందజేత

కారేపల్లి, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గల వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయానికి మండల కేంద్రానికి చెందిన కేతగాని నవాబుగౌడ్, లక్ష్మి జ్ఞాపకార్థం వారికుమారుడు శ్రీనివాస్‌గౌడ్ రూ.10వేలను శనివారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు తుమ్మోజీ రాంమూర్తి, వేములూరి కోటచారి మాట్లాడుతూ మార్చి2న స్వామివారి ఆలయం ప్రారంభం చేస్తున్నట్లు తెలిపారు.



విరాళం అందిస్తున్న దాతలు

ఏన్కూర్‌లో సామాజిక తనిఖీ



సామాజిక తనిఖీలో పాల్గొన్న అధికారులు

ఏన్కూరు, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): ఈజీఎస్ పనుల్లో అక్రమా లు జరిగినట్టు సామాజిక తనిఖీలో వెల్లడైంది. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు ఓపెన్‌ఫోరం నిర్వహించారు. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 ఏప్రిల్ 31 వరకు రూ.3.61కోట్ల పనులకు సంబంధించి ఆడిట్ జ రిగింది. అవకతవకలపై రూ.73వేలు జరిమానా, రికవరీ వి ధించారు. ఈసందర్భంగా అడిషనల్ పీడీ సీహెచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉపాధి హామీ పనులను వేగంగా చేయాలన్నారు. మరో నెలరోజుల్లో జిల్లాలో 7లక్షల25వేల మంది కూలీలు అవసరమని తెలిపారు. ప్రతి గ్రామపంచాయతీ నుంచి 12వందల మంది కూలీలకు తగ్గకుండా ఉండే విధంగా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. పనుల్లో నిర్లక్ష్య వైఖరి వహిస్తున్న ఏపీవోలకు షోకాజు నోటీసులు జారీ చేసినట్టు తెలిపారు. ఈకార్యక్రమంలో విజిలెన్సు అధికారి సక్రియ, సోషల్ ఆడిట్ ఎస్ఆర్పీ వెంకన్న, ఏపీడీ వెంకటపతి రాజు, ఎంపీడీవో సకినాల రమేష్, ఏపీవో మా రయ్య తదితరులు పాల్గొన్నారు.

టీవైటీసీసీ జిల్లా కార్యవర్గం ఎన్నిక

పెనుబల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యోగా టీచర్స్ కోఆర్డినేషన్ కమిటీ కార్యవర్గాన్ని శనివారం రాష్ట్ర క మిటీ ఆధ్వర్యంలో ఎంపిక చేశారు. జిల్లా అధ్యక్ష, కార్య దర్శులుగా గుమలాపురం సత్యనారాయణ, చింతకింద రామకృష్ణలను ఎన్నుకున్నారు. రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు రవికిషోర్, సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ బ్రిజ్ భూషణ్ పురోహిత్, ప్రధాన కార్యదర్శి సత్యారెడ్డి ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. జిల్లా ఉపాధ్యక్షుడిగా చల్లగుండ్ల అప్పారావులకు బాధ్యతలను అ ప్పగించారు. తెలంగాణలో ఉన్న యోగా టీచర్లందరిని ఒక కూటమిగా ఏర్పాటుచేసి యోగాను ప్రతి ఒక్కరికి పరిచయం చేయటం టీవైటీసీసీ ప్రధాన ఉద్దేశ్యమన్నారు.



సమావేశంలో పాల్గొన్న యోగా కమిటీ సభ్యులు

శివరాత్రి ఏర్పాట్ల పరిశీలన



మాట్లాడుతున్న తహసీల్దార్ సునీతా ఎల్జిబెత్

ముదిగొండ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ మండలం వల్లాపురం శివాలయంలో జరిగే మహాశివరాత్రి ఉత్సవాల ఏ ర్పాట్లపై శనివారం తహసీల్దార్ సునీతా ఎ ల్జిబెత్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆలయానికి చేరుకొని నిర్వహణ కమిటీతో మా ట్లాడి శివరాత్రి ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్ఐ ప్రసన్నకుమార్, గ్రామస్థులు, పూజారి పాల్గొన్నారు.

జిజ్ఞాస పోటీలకు జేవీఆర్ విద్యార్థులు

సత్తుపల్లి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి జిజ్ఞాస పోటీలకు తమ విద్యార్థినులు ఎంపికైనట్లు స్థానిక జేవీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నంద్రు గోపీ తెలిపారు. శనివారం కళాశాల ఆవరణలో ఎంపికైన విద్యార్థినీలను ప్రత్యేకంగా అభినందించారు. అదేవిధంగా కంప్యూటర్ సైన్స్ విభాగం విద్యార్థులు మన్నేని శ్రీనివాసరావు పర్యవేక్షణలో సమర్పించిన స్టూడెంట్ ఇన్‌ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ సిస్టం అనే ప్రాజెక్టు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. కార్యక్రమంలో జిజ్ఞాస కో-ఆర్డినేటర్ డాక్టర్ కే.పద్మరాణి, కంప్యూటర్ సైన్స్ విభాగం అధిపతి డాక్టర్ వీరారెడ్డి పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న దాతలు

వైరా, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీ ఒకటోవార్డులో క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న దుగ్గిరాల రాణికి చికి త్స నిమిత్తం కాంగ్రెస్ నా యకుడు వీరంశెట్టి సీతరాములు ఆధ్వర్యంలో రూ.25 వేల ఆర్థిక సహాయాన్ని శనివారం అందజేశారు. దుగ్గిరాల బాలస్వామి కుమార్తె అయిన రాణి క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నప్పటికీ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న విషయాన్ని తెలుసుకొని సీతరాములు తన స్నేహితులతో కలిసి ఈ ఆర్థికసాయం చేశారు. దుగ్గిరాల ఎలీషా, జాకోబు పాల్గొన్నారు.

కల్లూరులో...

కల్లూరు, ఫిబ్రవరి22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వైబీపల్లికి చెందిన కటూకూరి తిరుపతమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. మాజీ ఎంపీపీ బీరవల్లి బ్రదర్స్ రఘు, శ్రీనివాసరావులు రూ.10 వేలు అందించారు. ఈ కార్యక్రమలో టీవీఎల్ నరిసింహారావు, బీరవల్లి కృష్ణ, సాతునూరి శ్రీనివాసరావు, కటూకూరి వెంకటేశ్వరరావు, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చింతకానిలో...



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న నాయకులు

చింతకాని, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లచ్చగూడెం గ్రామానికి చెందిన కౌలు రైతు నెర్సుల యల్లయ్య కుటుంబాన్ని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు శనివారం ఆ పార్టీ మండల కమిటీ పరామర్శించింది. ఆత్మ కమిటీ డైరక్టర్ కొప్పుల గోవిందరావు బాధిత కుటుంబానికి రూ. 10వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో అంబటి వెంకటేశ్వర్లు, కన్నెబోయిన గోపి, మడిపల్లి భాస్కర్, సట్టు వెంకటేశ్వర్లు, ఓర్సు వీరభద్రం, శ్రీరాముల నాగేశ్వరరావు, రమేష్, నాగేశ్వరరావు, రంగారావు, భూష య్య, గోపి తదితరులు పాల్గొన్నారు.